ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -127 పేజీలు - 08 వెల - 04/- శుక్రవారం 21 ఫిబ్రవరి 2025

## ఏపీలో 25 వేల కోట్ల పర్యాటక పెట్టుబడులే లక్ష్యంగా అడుగులు



: మంత్రి కందుల దుర్గేశ్

పర్యాటక రంగంలో పెట్టుబడులకు మంత్రి కందుల దుర్గేశ్ ఆహ్వానం

ఢిల్లీలో సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్, టూరిజం ఎగ్జిబిషన్ -2025పీపీపీ విధానంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని వెల్లడి

ఇన్వెస్టర్లకు మెరుగైన రాయితీలు కల్పించి సహకారం అందిస్తామని భరోసా

2లో

# మిర్చి రైతుకు భరోసా

**మిర్చి ధర పతనంపై కేంద్రంతో మాట్లాడా... ఆందోళన వద్దు**


అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గడంతోనే మిర్చి ధర పతనమైందన్న చంద్రబాబు

పోలవరం పురోగతి, కేంద్రసాయంపై జలశక్తి మంత్రితో చర్చించినట్లు వెల్లడి

పోలవరం నీళ్లు బనకచర్లకు తీసుకెళ్లేందుకు కేంద్ర సాయం కోరామన్న ముఖ్యమంత్రి

వృథాగా సముద్రంలోకి పోయే నీటినే ఏపీ ఉపయోగించుకుంటోందని స్పష్టీకరణ

ఢిల్లీలో మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



న్యూఢిల్లీ,ఫిబ్రవరి 20 ఆంధ్ర ప్రగతి:
మిర్చి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ధరలు తగ్గడంపై కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ధరలు భారీగా పడిపోయాయన్నారు. గతంలో అంతర్జాతీయ మార్కెట్ బాగుండటంతో రైతులకు మంచి ధర వచ్చిందన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గడంతో ధరలు పడిపోయాయని, మిర్చి రైతుల సమస్యలను కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లానని ఆయన అన్నారు. కేంద్రమంత్రి పర్యటనలో ఉన్నందున వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల సమస్యలను వివరించినట్లు తెలిపారు. శుక్రవారం అధికారులతో కేంద్రమంత్రి సమీక్ష నిర్వహిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.

మిగతా 2లో



# ఢిల్లీ సిఎంగా రేఖాగుప్తా ప్రమాణం



దేశ రాజధాని ఢిల్లీలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. గురువారం మధ్యాహ్నం రామ్‌లీలా మైదానంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణస్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో అధికారాన్ని దక్కించుకున్న భాజపా.. ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించింది. దీనికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, భాజపా అగ్రనేతలు హాజరయ్యారు.

2లో

ప్రమాణం చేయించిన ఎల్జీ వికె సక్సేనా

హాజరైన ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు

ఎన్‌డి పక్షాన సిఎంలు, డిప్యూటి సిఎంలు హాజరు

ప్రత్యేక ఆకర్షణగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్

## బిఆర్ఎస్ అండతోనే ఎపి జల దోపిడీ

కృష్ణా జలాల్లో 200 టిఎంసిలు చాలన్న ఘనులు

- శ్రీశైలం,సాగర్‌లను ఎపికి అప్పగించి చోద్యం చూశారు

నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేశారు

- బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకంపై మండిపడ్డ ఉత్తమ్ కుమార్



2లో


## వాటామేరకే నీటిని వాడుకుంటున్నాం

తెలంగాణ నేతల జలదోపిడి ఆరోపణలపై స్పందించిన చంద్రబాబు

ఏపీ జల దోపిడీకి పాల్పడుతోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపణ

కృష్ణా జలాల్లో అధిక నీటిని వాడుకుంటున్నామనే ఆరోపణలను కొట్టిపారేసిన చంద్రబాబు

వాటా మేరకే నీటిని వినియోగించుకుంటున్నట్లు వెల్లడి



2లో

## కూటమి నేతల్లో ఎక్కడా సమన్వయ లోపం లేదు

వెన్నునొప్పి కారణంగానే కొన్నికార్యక్రమాలకు దూరంగా ఉన్నా

ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం

ఎపి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ,ఫిబ్రవరి 20 ఆంధ్ర ప్రగతి:
ఏపీలో మూడు పార్టీల నేతలు సమన్వయంతోనే కలిసి ముందుకు వెళుతున్నట్టు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఢిల్లీలో సిఎం రేఖాగుప్తా ప్రమాణ స్వీకారానికి గురువారం హాజరైన ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మిగతాది 2లో...

## ఏపీ ఫైబర్ నెట్ ఉన్నతాధికారులపై ఛైర్మన్ వేటు

**9 నెలలుగా ఒక్క రూపాయి కూడా ఆదాయం రాలేదన్న జీవీ రెడ్డి**

**అధికారులు సహకరించడంలేదని ఆరోపణ**




**అమరావతి** ఫిబ్రవరి 20 ఆంధ్ర ప్రగతి:
కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడిచినా ఫైబర్ నెట్ కు పైసా ఆదాయం రాలేదని ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సంస్థలో ఉన్నతాధికారులు సహకరించడం లేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు ఉన్నతాధికారులను తొలగిస్తున్నట్లు గురువారం ప్రకటించారు. ఫైబర్ నెట్ బిజినెస్ హెడ్ గంధంచెట్టు సురేష్, ప్రొక్యూర్మెంట్ అసిస్టెంట్ మేనేజర్ శశాంక్ హైదర్ ఖాన్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ భరద్వాజలకు ఉద్వాసన పలికినట్లు తెలిపారు.గత ప్రభుత్వ పెద్దలతో చేతులు కలిపి తొలగించిన ఉద్యోగులకూ జీతాలు చెల్లించారని జీవీ రెడ్డి మండిపడ్డారు. ఫైబర్ నెట్ లో సంస్కరణలు ప్రతిపాదిస్తూ 400 మంది ఉద్యోగులను తొలగించాలని ఆదేశించినా వారు పట్టించుకోలేదని విమర్శించారు. ఈ ఆదేశాలపై ఎండీ, ఈడీ సంతకాలు చేయలేదన్నారు. ఇటీవల జీఎస్టీ అధికారులు ఫైబర్ నెట్ కు రూ.377 కోట్లు జరిమానా విధించిన విషయాన్ని తన దృష్టికి తీసుకురాలేదని చెప్పారు.ఈ తొమ్మిది నెలల్లో రాష్ట్రంలో ఒక్క కొత్త కనెక్షన్ కూడా ఇవ్వలేదని, సంస్థకు రూపాయి ఆదాయం రాలేదని తెలిపారు. ఎండీ దినేశ్ కుమార్ ఒక్క ఆపరేటర్ ను కూడా కలవడం లేదని, కనీసం సిబ్బందికి టార్గెట్లు కూడా పెట్టడంలేదని ఆరోపించారు.

## నైతిక విలువలు పాటించాలి

ఓటీటీ, సామాజిక మాధ్యమాలకు కేంద్రం హెచ్చరిక

అశ్లీల కంటెంట్‌పై ఫిర్యాదులు వచ్చాయని వెల్లడి

చిన్నారులకు 'ఏ' రేటెడ్ కంటెంట్ అందుబాటులో లేకుండా చూడాలన్న కేంద్రం




న్యూఢిల్లీ,ఫిబ్రవరి 20 ఆంధ్ర ప్రగతి:
ఓటీటీ, సామాజిక మాధ్యమాలు ఐటీ చట్టంలోని మార్గదర్శకాలను పాటించాలని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. ఐటీ చట్టం-2021లోని నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. అశ్లీల కంటెంట్‌పై అనేక ఫిర్యాదులు అందాయని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది.

# ఢిల్లీ సిఎంగా రేఖాగుప్తా ప్రమాణం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 20 ఆంధ్ర ప్రగతి:
దేశ రాజధాని దిల్లీలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. గురువారం మధ్యాహ్నం రామ్‌లీలా మైదానంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణస్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. 27 ఏళ్ల తర్వాత దిల్లీలో అధికారాన్ని దక్కించుకున్న భాజపా.. ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించింది. దీనికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, భాజపా అగ్రనేతలు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ తోపాటు కేంద్రమంత్రులు, ఎన్డీయే కీలక నేతలు, 20 రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు పాల్గొన్నారు. మరోవైపు సినీ, పారిశ్రామిక రంగాల పలువురు ప్రముఖులు సైతం విచ్చేశారు.



27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో బీజేపీ కార్యకర్తలు, నేతలు సంబరాల్లో మునిగితేలుతున్నారు. ఉదయం ఇంటినుంచి బయల్దేరిన రేఖాగుప్తా.. హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆమె రామ్‌లీలా మైదానానికి చేరుకొని, అందరినీ పలకరించారు. ఈ కార్యక్రమానికి సాధువులు, పలువురు ప్రముఖులు హాజరుకావడంతో భారీ భద్రత ఏర్పాటుచేశారు. 25,000 మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. రేఖా గుప్తాతో పాటు భాజపా ఎమ్మెల్యేలు పర్వేశ్ వర్మ, ఆశీశ్ సూద్, మజీందర్ సింగ్ సిర్సా, రవీందర్ ఇంద్రజ్ సింగ్, కపిల్ మిశ్రా, పంకజ్ కుమార్ మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కొత్త సీఎంకు జడ్ కేటగిరీ సెక్యూరిటీని కేటాయించనున్నారు. హరియాణాలోని జులానాలో 1974 జులై 19న జన్మించిన రేఖా గుప్తా.. దిల్లీ యూనివర్సిటీ పరిధిలోని దౌలత్‌రామ్ కళాశాలలో బీకాం చదివారు. ఆ సమయంలోనే ఏబీవీపీ ద్వారా విద్యార్థి రాజకీయాల్లో ప్రవేశించారు. 1995-96లో దిల్లీ వర్సిటీ విద్యార్థి సంఘం కార్యదర్శిగా పనిచేశారు. 1996-97లో అధ్యక్షురాలిగా సేవలందించారు. మేరఠ్‌లోని చౌధరీ చరణ్‌సింగ్ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రం పట్టా



పుచ్చుకొని కొంతకాలం న్యాయవాదిగా పనిచేశారు. 1998లో మనీశ్‌గుప్తాను వివాహం చేసుకున్నారు. 2007లో ఉత్తర పీతంపుర మున్సిపల్ కౌన్సిలర్‌గా విజయం సాధించారు. అనంతరం దక్షిణ దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆరెస్సెస్‌తో ఆమెకు సన్నిహిత సంబంధాలున్నాయి. సంఘ్ మహిళా సంబంధిత కార్యక్రమాల్లో ఆమె చురుకుగా పాల్గొనేవారు. ప్రస్తుతం భాజపా మహిళా మోర్చా జాతీయ ఉపాధ్యక్షురాలిగా, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా ఉన్నారు. భాజపా నుంచి సుష్మాస్వరాజ్, ఉమాభారతి, వసుంధర రాజే, ఆనందీబెన్ పటేల్‌ల తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 5వ మహిళగా, దేశంలో విభిన్న పార్టీల నుంచి సీఎం పదవిని చేపట్టిన 18వ అతివగా రేఖాగుప్తా నిలిచారు.

# బిఆర్ఎస్ అండతోనే ఎపి జలదోపిడీ

హైదరాబాద్,ఫిబ్రవరి 20 ఆంధ్ర ప్రగతి:
ఏపీ ప్రభుత్వం చేస్తున్న జలదోపిడీకి భారాస ప్రభుత్వం సహకరించిందని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు కేవలం 200 టీఎంసీలు సరిపోతాయని చెప్పిన ఘనత భారాసదని విమర్శించారు. నీటి పారుదల రంగాన్ని పూర్తిగా నాశనం చేసిన ఘనత బీఆర్ఎస్ దేనని కమీషన్ల కక్కుర్తితో అధిక వడ్డీకి వేల కోట్లు అప్పులు తెచ్చారని ఆరోపించారు. అప్పుల నుంచి బయటపడేందుకు తాము ప్రయత్నిస్తుంటే..బీఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎస్ఎల్ బీసీ టన్నెల్ ను పదేళ్లు పూర్తిగా పడుకోబెట్టారని ఆరోపించారు. లక్షా 85 వే లకోట్లు ఖర్చు చేసి ఎకరాకు నీళ్లివ్వలేదన్నారు ఉత్తమ్. సగం పూర్తయిన ప్రాజెక్టులను కేసీఆర్ పట్టించుకోలేదు.. విభజన చట్టం అమలు కోసం కేసీఆర్ ఎలాంటి ప్రయత్నం చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తెలంగాణకే 500 టీఎంసీలు కావాలని వాదన ప్రారంభించామన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే మహబూబ్‌నగర్ జిల్లా అద్భుతంగా ఉండేదన్నారు. భారాస ప్రభుత్వం వల్లే తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. జగన్‌తో స్నేహంగా ఉంటూ.. ఏపీ జలదోపిడీకి భారాస సహకరించిందన్నారు. జగన్ పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచుతున్నా, అక్రమంగా ముచ్చుమర్రి నిర్మిస్తున్నా కేసీఆర్ నోరెత్తలేదని మండిపడ్డారు.కాళేశ్వరం ప్రాజెక్టుతో నీళ్లు రాలేదు కానీ.. భారాస నేత జేబులు



నిండాయి. కాళేశ్వరంపై రూ.లక్షా 30వేల కోట్లు ఖర్చు చేస్తే మేడిగడ్డ కూలిపోయింది. కాళేశ్వరం ప్రాజెక్టు అప్పు తెలంగాణ ప్రజలు ఎన్నటికీ తీర్చలేనంత భారంగా మారింది. పదేళ్లు అధికారంలో ఉన్న భారాస ప్రభుత్వం కనీసం టెలిమెట్రీలు కూడా ఏర్పాటు చేయలేదు. కృష్ణా జలాలను జగన్ ప్రభుత్వం బేసిన్ అవతలకు తరలిస్తుంటే పట్టించుకోలేదు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీలు మన హక్కు అయితే 190 టీఎంసీల కంటే ఎక్కువగా ఎప్పుడూ వాడలేదు. కృష్ణా బేసిన్‌లో ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే మన వాటా పూర్తిగా వాడుకునేవాళ్లం. ఏదుల, దిండి ప్రాజెక్టులను కూడా పదేళ్లలో పూర్తి చేయలేదని ఉత్తమ్ విమర్శించారు. ఈక్రమంలోనే శ్రీశైలం ప్రాజెక్టును ఏపీకి అప్పగిస్తామని 2021-22లో బీఆర్ఎస్ ఒప్పుకుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. నాగార్జున సాగర్ శ్రీశైలం ప్రాజెక్టుల్ని బోర్డుకు అప్పగిస్తామని 2021లో బీఆర్ఎస్ ఒప్పుకుందన్నారు. 2023 నవంబర్ లో సాగర్ ను ఏపీ ఆక్రమించింది.. ఏపీ ఆక్రమణ తర్వాతే సాగర్ సీఆర్పీఎఫ్ ఆధీనంలోకి వెళ్లిందన్నారు. ఉమ్మడి ఏపీలో శ్రీశైలం నుంచి రోజు 4.2 టీఎంసీలు తీసుకెళ్లారని చెప్పారు ఉత్తమ్. రాష్ట్రం వచ్చాక బీఆర్ఎస్ హయాంలో రోజూ 9.6 టీఎంసీలు దోచుకెళ్లారని ఆరోపించారు ఉత్తమ్. కృష్ణా నీళ్లను ఏపీకి దోచి పెట్టినందుకే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ను ఓడించారని విమర్శించారు. హరీశ్ రావు ఇరిగేషన్ మినిస్టర్ గా కాదు..అసలు దేనికి పనికి రాడన్నారు. తెలంగాణ ప్రజలు, రైతుల ప్రయోజనాలు కాపాడుతామని వ్యాఖ్యానించారు.ఏపీ నీళ్ల దోపిడికి పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం సహకరించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు . జగన్ దోస్తీ కోసం రాయలసీమ లిఫ్ట్, పోతిరెడ్డిపాడు వదిలేశారని చెప్పారు. పదేళ్లలో శ్రీశైలం నుంచి ఔట్ సైడ్ బేసిన్ 1200 టీఎంసీలు తరలించారని వ్యాఖ్యానించారు. తెలంగాణకు 550 టీఎంసీలు రావాల్సి ఉన్నా.. 298 టీఎంసీలు సరిపోతాయని చెప్పిన ఘనత కేసీఆర్ దేనని విమర్శించారు. కేసీఆర్ అసమర్థత,చేతగాని తనం వల్లే పాలమూరుకు నీటి కష్టాలు వచ్చాయన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కనీసం టెలిమెట్రీ పరికరాలు కూడా పెట్టలేదని విమర్శించారు. కేసీఆర్ పదేళ్లు పాలమూరు ప్రాజెక్టులను పట్టించుకోలేదని విమర్శించారు. మేడిగడ్డ కూలితే ఒక్క పిల్లరే కూలిందని వాదిస్తున్నారు. వాళ్లే కట్టారు..వాళ్లే దోచుకున్నారు..వాళ్లే కూలగొట్టారు. కాళేశ్వరం అప్పులు తెలంగాణ ప్రజలకు ఎప్పటికీ భారమే. పాలమూరుకు వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరాకు నిళ్లివ్వలే. నీళ్ల కోసం కాదు బీఆర్ఎస్ నేతలు జేబులు నింపేందుకు కట్టారు. కృష్ణా నీళ్లలో ఏపీ దోపిడిని కేంద్రానికి వివరించాం.. కృష్ణా జలాల వాటా విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోంది. ఏపీ నీళ్ల దోపడిలో కేంద్రం జోక్యం చేసుకోవాలని ఉత్తమ్ అన్నారు.

## వాటా మేరకే నీటిని వాడుకుంటున్నాం

**అమరావతి** ఫిబ్రవరి 20 ఆంధ్ర ప్రగతి:
మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు నాయకులు ఆంధ్రప్రదేశ్ జల దోపిడీకి పాల్పడుతోందంటూ చేసిన ఆరోపణలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. కృష్ణా నదిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధిక నీటిని వాడుకుంటుందన్న తెలంగాణ నేతల వాదనలో ఎటువంటి వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. కృష్ణా జలాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించిన వాటా మేరకే నీటిని వినియోగిస్తున్నట్లు ఆయన తెలిపారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో గోదావరి నదిలో మిగులు జలాలు పుష్కలంగా ఉన్నాయని, సముద్రంలో కలిసే నీటిని మాత్రమే అదనంగా వాడుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. కృష్ణా జలాల విషయంలో మాత్రం కొంత సమస్య ఉందని, దీనికి సత్వర పరిష్కారం కనుగొనవలసిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఏపీలో 25 వేల కోట్ల పర్యాటక పెట్టుబడులే లక్ష్యంగా అడుగులు

ఢిలీఫిబ్రవరి 20 ఆంధ్ర ప్రగతి:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని, రానున్న ఐదేళ్లలో రూ.25 వేల కోట్ల పెట్టుబడులను లక్ష్యంగా నిర్దేశించుకున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. బుధవారం ద్వారకా ఢిల్లీలోని యశోభూమిలో జరిగిన సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్, టూరిజం ఎగ్జిబిషన్ -2025 (ఎస్ఏటీటీఈ)లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పర్యాటక రంగంలో ఉత్తేజం నింపేలా రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించిందని, తద్వారా పరిశ్రమలకు ఇచ్చే రాయితీలన్నీ పర్యాటకరంగానికి కూడా వర్తిస్తాయని తెలిపారు.ఏపీలో పర్యాటక అభివృద్ధి కోసం నూతన టూరిజం పాలసీ 2024-29ని తీసుకువచ్చామని వివరించారు. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్ షిప్ (పీపీపీ) విధానం ద్వారా పర్యాటకాభివృద్ధి చేయాలని భావిస్తున్నామని, పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు వచ్చే పెట్టుబడిదారులకు పెద్ద ఎత్తున మెరుగైన రాయితీలు, ప్రోత్సాహకాలను కల్పించి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని భరోసానిచ్చారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా రాష్ట్రవ్యాప్తంగా టూరిజం సర్క్యూట్‌లు, యాంకర్ హబ్‌లు, థీమాటిక్ అప్రోచ్ ఏర్పాటు, అంతర్జాతీయ మౌలిక వసతుల కల్పన వంటి విభిన్న కార్యక్రమాలు, పర్యాటక ప్రాజెక్టులు చేపడుతున్నామని వివరించారు. జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులకు తొలి గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలబెట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా రాష్ట్రంలో టెంపుల్, అడ్వెంచర్, ఎకో, వెల్ నెస్, హెరిటేజ్, రిలీజియస్, అగ్రి, మెడికల్, క్రూయిజ్, బీచ్, కోస్టల్, సీప్లేన్, ఫిల్మ్ టూరిజంను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. పర్యాటక రంగం ద్వారా 15 శాతం ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులు ఆహ్లాదంగా ఉంటూ ఎక్కువ రోజులు గడిపేలా మెరుగైన సేవలు, మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామని మంత్రి దుర్గేశ్ అన్నారు.

## కూటమి నేతల్లో ఎక్కడా సమన్వయ లోపం లేదు

**అమరావతి** ఫిబ్రవరి 20 ఆంధ్ర ప్రగతి:
వెన్ను నొప్పి కారణంగానే రాష్ట్రంలో కొన్ని సమావేశాలకు హాజరుకాలేకపోయానని.. ఇప్పటికీ వెన్ను నొప్పి తీవ్రంగా బాధిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. ఏపీని జగన్ అప్పుల కుప్పగా మార్చారని.. అందువల్ల ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని వెల్లడించారు. అయినా ఇచ్చిన హామీలు అమలు చేసుకుంటూ ముందుకు వెళుతున్నామన్నారు. పర్యావరణ, అటవీ శాఖలు తనకు చాలా ఇష్టమైన శాఖలని.. నిబద్ధతతో తన మంత్రిత్వశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మధ్య ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కొన్ని సమావేశాలకు దూరంగా ఉండడంపై సోషల్ మీడియాలో పలు రకాల చర్చలు జరుగుతున్నాయి.. అయితే, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా ప్రమాణస్వీకారానికి.. ఎన్డీఏ సమావేశానికి హాజరైన పవన్ కల్యాణ్.. మీడియా చిట్‌చాట్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు.. ఏపీలో సమన్వయంతోనే కలిసి ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. వెన్ను నొప్పి కారణంగానే ఏపీలో కొన్ని సమావేశాలకి హాజరుకాలేకపోయానన్న ఆయన.. ఇప్పటికీ వెన్ను నొప్పి తీవ్రంగా బాధిస్తోందన్నారు.. ఢిల్లీ సీఎం ప్రమాణస్వీకారం వేదికపై ఎన్డీఏ నేతలను అందరినీ పలకరిస్తూ ముందుకు సాగిన ప్రధాని మోడీ.. ఏపీ డిప్యూటీ సీఎంను ప్రత్యేకంగా పలకరించారు.. ఇద్దరి మధ్య సరదా సంభాషణ సాగినట్టు ఆ దృశ్యాలను చూస్తుంటే స్పష్టమవుతుండగా.. ఆ ర్వాత మీడియాతో మాట్లాడిన పవన్ కల్యాణ్.. మీరు హిమాలయాలకు వెళ్తున్నారా? అంటూ ప్రధాని మోడీ ప్రశ్నించారని.. వేదిక పైకి వచ్చే సమయంలో ఎన్డీఏ నేతలందరినీ పలకరించిన మోడీ.. ప్రత్యేక వస్త్రధారణలో ఉన్న పవన్ ను చూసి కొద్దిసేపు ముచ్చటించారు.. మోడీ ఏం మాట్లాడారని మీడియా ప్రతినిదులు ప్రశ్నించగా.. వివరాలు వెల్లడించిన ఆయన.. ప్రధాని నాపై చాలాసార్లు జోకులు వేస్తుంటారు.. ఈ రోజు నా వస్త్రధారణ చూసిన తర్వాత అన్నీ వదిలేసి హిమాలయాలకు వెళ్తున్నావా? అని ప్రధాని అన్నారు.. అలాంటిదేమీ లేదని నేను చెప్పాను.. చేయాల్సింది చాలా ఉంది అని ప్రధాని మోడీకి చెప్పానంటూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు.

## నైతిక విలువలు పాటించాలి

**(మొదటి పేజి తరువాయి)** యూట్యూబ్‌లో అశ్లీల కంటెంట్‌ను నియంత్రించాలని ఇటీవల సుప్రీంకోర్టు కూడా ఆదేశించిందని గుర్తు చేసింది.ఇండియాస్ గాట్ లాటెంట్ షోలో రణ్‌వీర్ అల్హాబాదియా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఈ క్రమంలో నిబంధనలు పాటించాలని కేంద్రం హెచ్చరించింది. చిన్నారులకు 'ఏ' రేటెడ్ కంటెంట్ అందుబాటులో లేకుండా చూడాలని ఆదేశించింది. నిబంధనలు ఉల్లంఘించే ఏ కంటెంట్‌ను కూడా ప్రసారం చేయవద్దని స్పష్టం చేసింది. వయస్సు ఆధారిత కంటెంట్ అందుబాటులో ఉండాలని తెలిపింది. ఓటీటీలు స్వీయ నియంత్రణను కలిగి ఉండాలని, నైతిక విలువలను పాటించాలని తెలిపింది.

# మిర్చి రైతుకు భరోసా

**(మొదటి పేజి తరువాయి)**
మిర్చి ధర పతనంపై సీఎం చంద్రబాబు కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు.

రైతులను ఆదుకోవాలని కేంద్రాన్ని కోరాం

ఈ యేడాది 12 లక్షల మెట్రిక్ టన్నుల మిర్చి సేకరించాల్సి ఉందని ఆయన అన్నారు. ఇప్పటికే 4 లక్షల మెట్రిక్ టన్నుల మిర్చి మార్కెట్‌కు వచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. దాదాపు 5 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది రాష్ట్రంలో మిర్చి సాగైందని, ఎప్పుడూ లేనంతగా రేట్లు పడిపోయాయని ఆయన అన్నారు. ఏ పరిస్థితిలోనూ రైతులను ఆదుకోవాలని కేంద్రాన్ని కోరామని ముఖ్యమంత్రి తెలిపారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద 25 శాతం మాత్రమే ఇస్తారని, సాగు ఖర్చులను లెక్కలు వేసి ధరలు నిర్ణయించాలని అన్నారు. అవన్నీ సరిచేయాలని కేంద్రమంత్రిని కోరామని అన్నారు.

దీనిపై శుక్రవారం సమావేశమై చర్చించిన తర్వాత స్పష్టత ఇస్తామని కేంద్రమంత్రి చెప్పారని ముఖ్యమంత్రి తెలిపారు. ఏ విధంగానైనా రైతులను ఆదుకోవడమే ముఖ్య ఉద్దేశమని ఆయన అన్నారు. శనివారం వ్యాపారులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులతో మాట్లాడి ధరల పతనానికి కారణాలు తెలుసుకుంటామని ఆయన చెప్పారు. ఇప్పటికే కేంద్రానికి మూడు సార్లు లేఖలు రాశామని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా అధికారులు వచ్చి కేంద్ర అధికారులతో మాట్లాడారని అన్నారు. మిర్చి రైతులను ఆదుకోవాలని కోరడానికి ఢిల్లీకి వచ్చామని, రైతులు నష్టపోకుండా ఏం చేయాలో అది చేస్తామన్నారు.

రైతులను పట్టించుకోని వారు మాట్లాడుతున్నారు

పంటలకు సంబంధించి ధరలు ఒక్కోసారి తగ్గుతాయని, ఒక్కోసారి పెరుగుతాయని ముఖ్యమంత్రి తెలిపారు. రైతులకు గతంలో ఏమీ చేయలేని వారు ఇప్పుడొచ్చి మాట్లాడుతున్నారని విమర్శించారు. 2019కి ముందు ధరలు తగ్గితే దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.138 కోట్లు విడుదల చేసి మిర్చి రైతులను ఆదుకున్నామని ఆయన తెలిపారు. మళ్లీ డబ్బులివ్వబోయేది ఎన్డీయేనే అన్నారు. బాధ్యత లేకుండా మిర్చి యార్డులోకి వెళ్లారని అన్నారు. ఎన్నికల కోడ్ అన్ని రాజకీయ పార్టీలకు వర్తిస్తుందని ఆయన గుర్తు చేశారు. అక్రమాలు చేసే వారికి రక్షణ ఇవ్వాలా? అని ప్రశ్నించారు.జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కూడా కలిసి జల్ జీవన్ మిషన్, పోలవరంపై చర్చించినట్లు చెప్పారు. పోలవరం పనులు సజావుగా సాగుతున్నాయని, 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చంద్రబాబు అన్నారు. నదుల అనుసంధానంపైనా చర్చించామన్నారు. సముద్రంలోకి వృథాగా వెళ్లే నీరు ఉపయోగించుకుంటే రాష్ట్రంలో కరువు లేకుండా ఉంటుందని అన్నారు. పోలవరం నుంచి బనకచర్ల నీళ్లు తీసుకెళ్లేందుకు కేంద్ర సహకారం కోరామని, దీనిపై అధ్యయనం చేయడానికి కేంద్ర ప్రతినిధులు కూడా రాష్ట్రానికి వస్తారని చెప్పారు.

జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయి నీటిని అందించాలన్నది తమ లక్ష్యమని ఆయన అన్నారు. కానీ గత ప్రభుత్వం ఈ పథకాన్ని ఒక్క శాతం కూడా ఉపయోగించుకోలేదని విమర్శించారు. రాష్ట్రానికి రూ. 27 వేల కోట్లను కేంద్రం మంజూరు చేసిందని అన్నారు. పైపులైన్ల ద్వారా కాకుండా బోరు బావుల ద్వారా ఇస్తామని చెప్పారు. కేంద్రం ఇచ్చిన రూ.50 వేల కోట్ల నిధులను ఉత్తరప్రదేశ్ ఖర్చు చేసిందని, గుజరాత్‌లో ఇంటింటికీ కుళాయి ద్వారా నీళ్లు నిరంతరం ఇస్తున్నారని వెల్లడించారు.

కేంద్రం ఈ పథకాన్ని మళ్లీ నిబంధనలు మార్చి 2028కి పనులు పూర్తి చేయాలని సమయం పెంచిందని అన్నారు. దీని ప్రకారం గతంలో కేటాయించిన రూ.27 వేల కోట్లు మాత్రమే వస్తాయని, రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో కుళాయి ద్వారా నీరివ్వాలంటే అదనంగా రూ.54 వేల కోట్లు అవసరమని ఆయన అన్నారు. దీనిపై కూడా కేంద్రంతో మళ్లీ సంప్రదిస్తామని అన్నారు. ప్రస్తుతం రూ.27 వేల కోట్లకు డీపీఆర్ సిద్ధం చేసి కేంద్రాన్ని నిధులు కోరుతామని తెలిపారు.

గత ప్రభుత్వం అవలంభించిన తప్పుడు విధానాల వల్ల ప్రజలు ఏ విధంగా నష్టపోతారో ఈ జల్ జీవన్ మిషన్ ఒక ఉదాహరణ అని చంద్రబాబు అన్నారు. 93 కేంద్ర ప్రాయోజిత పథకాలను ఐదేళ్ల పాటు నిర్వీర్యం చేశారని గత ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించారు. వాటిల్లో కొన్ని పథకాలకు మేము వచ్చాక మ్యాచింగ్ గ్రాంట్ కేటాయించి నిధులు ఖర్చు చేసి యూసీలు ఇచ్చామని అన్నారు. కేంద్రం ఇచ్చే పథకాలు ఉపయోగించుకుంటే రాష్ట్రానికి ఎంతో మంచి జరుగుతుందని, కానీ గత ప్రభుత్వ చేతకాని పాలన వల్ల సమస్యలు వచ్చాయన్నారు. వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు వెళుతున్నామని ముఖ్యమంత్రి అన్నారు.

నదులు ప్రవహించే వరుసలో చూసుకుంటే ఆంధ్రప్రదేశ్ చిట్టచివర ఉందని చంద్రబాబు అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నేను తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనేక ప్రాజెక్టులు పూర్తి చేసి తెలంగాణకు నీళ్ళందించామని అన్నారు. ఇప్పుడు సముద్రంలోకి వెళ్లే నీరు ఉపయోగించుకోవాలని చూస్తున్నామని, వృధాగా సముద్రంలోకి పోయే నీటిని ఏపీ ఉపయోగించుకునే అవకాశం ఉందని, వాటినే వాడుకుంటున్నామని ఆయన తెలిపారు. ఏపీలో ఎన్డీయే చిత్తశుద్ధితో ప్రజల కోసం పని చేస్తోందని ఆయన అన్నారు.

# దేశవ్యాప్తంగా ఆర్యవైశ్యులు కు అండగా బిజెపి.!




- -ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆర్యవైశ్య మహిళ రేఖా గుప్తకు అభినందనలు.
- -ఆర్యవైశ్యులు సేవకు ప్రతిరూపాలు.
- -ఆర్యవైశ్యులకు వెనుక ప్రధాని మోది...ముందు రేఖా గుప్త ఉంటారు.
- -నంద్యాల బిజెపి కార్యాలయం ఎదుట ఆర్యవైశ్యుల సంబరాలు.
- -నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 20:
దేశవ్యాప్తంగా ఆర్యవైశ్యులు బిజెపి ప్రభుత్వం అండగా ఉంటుందని నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మదు పేర్కొన్నారు.డిల్లి పీఠంపై ఆర్యవైశ్య మహిళ రేఖా గుప్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా బిజెపి కార్యాలయం వద్ద ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో సంబరాలు చేసుకున్నారు.డిల్లి ముఖ్యమంత్రి రేఖా గుప్తా కు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆర్యవైశ్య ప్రముఖులు, జిల్లా అధ్యక్షులు అభిరుచి మదు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆర్యవైశ్యులు బిజెపి అండగా నిలుస్తుందన్నారు.ఆర్యవైశ్యులు వెనుక ప్రధాని నరేంద్ర మోడీ,ముందు డిల్లి ముఖ్యమంత్రి రేఖా గుప్త ఉంటారని అన్నారు.దేశవ్యాప్తంగా ఆర్యవైశ్యులు సంతోషంతో సంబరాలు చేసుకుంటున్నారని అన్నారు.బిజెపి 27 ఏళ్ల కలను డిల్లిప్రజలు నెరవేర్చారని అన్నారు.డిల్లి ఎన్నికల్లో హేమా హేమీలు పోటిలో నిలబడినా గత పాలకుల పాలనలో విసుగెత్తి బిజెపి ప్రభుత్వానికి అందలం ఎక్కించారన్నారు.డిల్లిని 10 ఏళ్లు పాలించిన కేజ్రీవాల్ అవినీతిలో కూరుకుపోయారని ఆరోపించారు.అవినిధిలేని పాలన డిల్లి ప్రజలకు అందించాలనే కోరిక నేటితో నెరవేరిందన్నారు.అవినీతి లో కూరుకుపోయిన డిల్లి నీ అభివృద్ధి చేయాలనే తలంపుతో మంచి ముఖ్యమంత్రిని నిలబెట్టారని అన్నారు.ఏ వర్గం నిబద్ధతతో పనిచేస్తారని ఆలోచించి ఆర్యవైశ్యులు విశ్వాసం,సేవాగుణం తోపాటు అవినీతికి ఆమడ దూరంలో ఉంటారని ఆర్యవైశ్య మహిళకు ప్రాధాన్యత ఇస్తూ రేఖా గుప్తను డిల్లి పీఠం ఎక్కించారని అన్నారు.రాజకీయాల్లో ఏ పార్టీలైన ఎన్నికల్లో ఆర్యవైశ్యులు ను ఓటింగ్ యంత్రలుగా వాడుకొని వదిలేస్తున్నారని అన్నారు.దేశవ్యాప్తంగా ఆర్యవైశ్యులు కు ధైర్యం నింపడానికి బిజెపి ఆర్యవైశ్యులు కు సముచిత స్థానం కల్పించిందని అన్నారు.ఆర్యవైశ్యులు 21 ఏళ్లు వస్తె పెళ్లి చేసి పంపించే ఈ కాలంలో రేఖా గుప్త రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటూ,సామాన్య ప్రజల స్థితిగతులు అవగాహన ఉండడం,నిబద్ధత కల్గివుండడంతో డిల్లి పీఠం దక్కించుకుందని అన్నారు.డిల్లీలో కుల మతాలకు ,పార్టీలకు అతీతంగా అందరికీ మేలు చేస్తూ,అభివృద్ధిలో ముందంజలో ఉండాలని అన్నారు.ఆర్యవైశ్య ప్రముఖులు కశెట్టి కృష్ణ మూర్తి,చంద్ర శేఖర్, మేడా మురళీధర్,మారం వినయ్,బింగు మళ్ల శ్యామ్ సుందర్ గుప్తా,జే.వి. సి.ప్రసాద్, నెరవాటి రవి కుమార్,మారం శేషయ్య,బొగ్గరపు ఆంజనేయులు,శ్రీనివాసులు,గెలివి శేఖర్ లు మాట్లాడుతూ డిల్లి ముఖ్యమంత్రిగా ఆర్యవైశ్య మహిళ రేఖా గప్తను తీసుకోవడం గర్వించదగ్గ విషయం అన్నారు.ప్రధాని నరేంద్ర మోడీ,హెూమ్ మంత్రి అమిత్ షా కు ధన్యవాదాలు తెలిపారు.దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వానికి ఆర్యవైశ్యులు అండగా ఉంటామని పేర్కొన్నారు.అనంతరం టపాసులు పేల్చి,మిఠాయిలు పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో మారం శేషయ్య,శ్రీనివాసులు,ఇనుగురు రమేష్ బాబు, వంకదారి రామ్మోహన్ రావు, ఆడిటర్ గోపాల్,ఎస్వీ రంగారావు,పాలూరు నారాయణ,పుసుపుల శివ సాయి,నాగ షణ్ముఖ, చిట్టే దివాకర్, పాలూరి గంగాధర్, ఎలిశెట్టి మురళీ మోహన్,చల్లా మదు,ఆర్యవైశ్య మహిళా మండలి నాయకురాలు శోభారాణి,జక్కా రాజేశ్వరి,ప్రసన్న లక్ష్మి, తాడువాయి ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.







# వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రాధాన్యత..!

**-రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.**

ఆంధ్ర ప్రగతి అమరావతి ఫిబ్రవరి 20:
రాష్ట్రంలో ని వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని, ప్రణాళికాబద్ధమైన చర్యలకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. గురువారం అమరావతి లోని సచివాలయంలో మైనారిటీ మంత్రిత్వ శాఖ పేషీ లో మంత్రి ఫరూక్ ను వక్ఫ్ బోర్డు సభ్యులు డాక్టర్ ఆఫీయా, షేక్ ఖాజా తో పాటు పలువురు ముస్లిం మైనారిటీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వక్ఫ్ బోర్డు కు సంబంధించిన పలు అంశాలు, వక్ఫ్ బోర్డు ద్వారా చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక అమలుకు సంబంధించి బోర్డు సభ్యులతో మంత్రి చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు.వక్ఫ్ ఆస్తుల నిర్వహణ మరియు పరిరక్షణ, మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములను స్వాధీనం చేసుకోవడం, ఉన్న భూములను పరిరక్షించుకోవడం



పై ఒక ప్రణాళికబద్ధమైన కార్యాచరణ సిద్ధం చేసి మైనారిటీ మంత్రిత్వ శాఖ నేతృత్వంలో చర్యలు చేపట్టడం జరుగుతున్నదని మంత్రి అన్నారు.అధికారంలోకి వచ్చిన 8 నెలల కాలంలో మైనార్టీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో భాగంగా ప్రభుత్వం బడ్జెట్లో మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధుల కేటాయింపు చేయడం జరిగిందన్నారు. 2025-2026 ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో కూడా మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం నిధుల కేటాయింపులో అధిక ప్రాధాన్యత ఇవ్వబోతున్నదని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.
రంజాన్ మాసంలో మసీదులు, ఈద్గాలు,దర్గాల వద్ద ప్రత్యేక వసతులు కల్పించాలని రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను ఎంహెచ్ పిఎస్ నాయకులు కోరారు. గురువారం అమరావతి సచివాలయంలోని మంత్రి పేషీ లో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షుబ్లీ తదితరులు మంత్రిని కలిశారు.రాష్ట్ర వ్యాప్తంగా మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చెయ్యాలని, టిడిపి ప్రభుత్వ హయాంలో అన్ని మసీదులకు మరమ్మత్తుల కొరకు ప్రతి ఏటా ఇచ్చే రూ.25వేలు మంజూరు చెయ్యాలని, శిక్ష అనుభవిస్తున్న ముస్లిం ఖైదీలకు సహారీ, ఇఫ్తార్ ఏర్పాటు కొరకు జైళ్ల శాఖకు ఆదేశించాలని, ప్రభుత్వం తరపున రంజాన్ ఉత్సవాలు (జష్నే రంజాన్) నిర్వహించాలని కోరారు.వచ్చే బడ్జెట్ లో మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేకంగా రూ.3296 కోట్లు మంజూరు చెయ్యాలని మంత్రిని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు.
ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంహెచ్ పిఎస్ ఉలేమా వింగ్ అధ్యక్షులు మౌలానా అబ్దుల్ రషీద్,నాయకులు సగీర్, ఖాజా, అర్షద్, భాష తదితరులు పాల్గొన్నారు.

# పేద ముస్లిం అమ్మాయిలకు అంజుమన్ ఆధ్వర్యంలో రూ. 50,000/- కానుక.

**-అంజుమన్ అధ్యక్షులు నశ్యం ఖుద్దూస్.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 20: ద
గత పదిహేనేళ్ళుగా నంద్యాల అంజుమన్ కమిటి ఆధ్వర్యంలో పేద ముస్లీం యువతులకు సామూహిక వివాహాలు చేసి ఆర్థిక సహాయం అందించటం జరుగుతుంది. ఈ నేపథ్యంలో 10 ఏప్రెల్ 2025 గురువారం అంజుమన్ షాదిఖానాలో ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు అంజుమన్ అధ్యక్షులు నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ తెలిపారు. ఈ సంధర్భంగా నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ మీడియాతో మాట్లాడుతూ ఏప్రెల్ నెల 5 వ తేది నాటికి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గల అంజుమన్ లో పొందిన ధరఖాస్తులు పూర్తి చేసి, వధూవరుల ఆధార్, బ్యాంక్ ఖాతా జిరాక్స్ , ఫోటోలు జత చేసి ఇవ్వాలని, వధువు నంద్యాలకు చెంది 18 ఏండ్లు నిండి ఉండవలెనన్నారు. అంజుమన్ షాది ఖానాలో సాముహిక వివాహ వేదికలో “నిఖా” చేసుకోవాడానికి సిద్ధం పడిన పేద ముస్లిం వనితలు దరఖాస్తులు ఇవ్వాలన్నారు. వివాహం రోజే వధువు పేర రూ.50,000/-నగదు చెక్కు ఇవ్వబడునని , వరుడి నిఖా ఫీజు కూడా అంజుమన్ భరిస్తుందని నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ తెలిపారు. ఈ సందర్భంగా జమాఆతె ఇస్లామీ నంద్యాల అధ్యక్షులు షేక్ అబ్దుల్ సమద్ అంజుమన్ సేవలు ప్రశంసిస్తూ నంద్యాల పేద ముస్లింలు వనితలకు ఇది మంచి అవకాశమని, తలిదండ్రులు తమ కూతుర్ల , బంధువులు అనాథల పెళ్ళిళ్ళు అంజుమన్ లో చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఎక్కడా ఓ స్వచ్ఛంద సంస్థ అమ్మాయిల వివాహానికి ఇంత భారీగా నిర్వహించి యాభైవేల మొత్తం ఇవ్వటం లేదని, నంద్యాల అంజుమన్ పెద అవివాహిత వనితలకు పెద్ద వరం అన్నారు. ఎక్కడో యాచించడం కన్న ముస్లిం ప్రజా సంస్థ అయిన అంజుమన్ సేవలు సద్వినియోగం చేసుకొనుటకు ముందుకు రావాలని, “షాది సాదికరో” అన్నట్లు నిరాడంబరంగా కట్నకానుకలు లేని వివాహాలు చేసుకోవాలని ముస్లిం సమాజానికి సమద్ పిలుపు నిచ్చారు. మరిన్ని వివరాలకు ... నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ 9866242742 సంప్రదించగలరు.

# ఏపీలో మైనారిటీల సంక్షేమానికి పిఎంజెవికె కింద రూ. 600 కోట్లు ఇవ్వండి.!

**-కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కు మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ లేఖ. -రూ.1000 కోట్ల ప్రతిపాదనలో 60%కేంద్ర వాటా ఇవ్వాలని కోరిన మంత్రి.**

ఆంధ్ర ప్రగతి అమరావతి ఫిబ్రవరి 20:
ఆంధ్ర ప్రదేశ్ లో మైనారిటీల సామాజిక ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడానికి, మైనారిటీ ప్రజల జీవన నాణ్యతను పెంపొందించడానికి ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యక్రమం కింద రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు కేంద్రం వాటా కింద రూ. 600 కోట్లు ఇవ్వాలని కోరుతూ కేంద్ర మైనారిటీ మంత్రిత్వ శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కు రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ గురువారం లేఖ రాశారు. లికేంద్రమంత్రికి రాసిన లేఖలోని ముఖ్యమైన అంశాలను ప్రస్తావిస్తూ అమరావతిలో మంత్రి ఫరూక్ ఒక ప్రకటనను విడుదల చేశారు. మైనారిటీల సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆంధ్రప్రదేశ్ ఒక మార్గదర్శక రాష్ట్రంగా కేంద్ర నిధులను ఉపయోగించుకుంటున్నదని పేర్కొన్నారు.రాష్ట్ర మైనారిటీల ఫైనాన్స్ కార్పొరేషన్, రాష్ట్రంలోని వక్ఫ్ భూముల రక్షణ మరియు అభివృద్ధి కోసం, వక్ఫ్ బోర్డు, వక్ఫ్ ఆస్తుల సర్వే మరియు డిజిటలైజేషన్ కోసం, క్రైస్తవుల సంక్షేమం కోసం, క్రైస్తవ మైనారిటీల ఫైనాన్స్ కార్పొరేషన్, దూదేకుల ముస్లిం మైనారిటీల కోసం దూదేకుల సమాఖ్య, ఉర్దూ భాషా అభివృద్ధి కోసం ఉర్దూ అకాడమీ, మైనారిటీల విద్యా అభివృద్ధి కేంద్రం, మైనారిటీల కమిషన్ మరియు వక్ఫ్ ట్రిబ్యునల్ వంటి జుడిషియల్ సంస్థలు, మైనారిటీల సంక్షేమం కోసం ప్రధానమంత్రి 15 పాయింట్ల కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో కూడా ఏపీ ముందు ఉన్నదన్న విషయాన్ని కేంద్రమంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఏపీ లో మైనారిటీల జనాభా దాదాపు 43.46 లక్షలు ఉందన్నారు.2014-2019 ఆర్థిక సంవత్సరాలలో కేంద్రం నిధులను సమర్థవంతంగా వినియోగించడం జరిగిందని అన్నారు. మైనారిటీల సంక్షేమానికి ఎన్డిఏ కట్టుబడి ఉందని, మైనారిటీల సంక్షేమం కోసం మ్యానిఫెస్టో ప్రకారంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు మైనార్టీల సంక్షేమం కోసం పిఎంజెవికె కింద రూ. 1000 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి డీటెయిల్ ప్రాజెక్టు రిపోర్ట్ (డి పి ఆర్ ) లతో కూడిన ప్రతిపాదనలు కేంద్రం దృష్టికి తీసుకు వస్తున్నట్లు తెలిపారు. పీఎంజెవికె పథకం కోసం 2024-2025 కు రూ. 208.24 కోట్లు,2025-2026



బడ్జెట్లో రాష్ట్ర వాటాగా రూ. 250 కోట్లు కేటాయించడం జరిగిందని కేంద్ర మంత్రికి రాసిన లేఖలో ఫరూక్ పేర్కొన్నారు. పీఎంజెవికె కింద 2025-2026 లో మైనార్టీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొత్త ప్రాజెక్టులపై దృష్టి సారించడం జరిగిందని , ఇందులో భాగంగానే రూ. 1000 కోట్లతో కార్యాచరణ సిద్ధం చేశామని, కేంద్రం వాటా కింద రూ. 600 కోట్లు ఇవ్వాలని మంత్రి ఫరూక్ లేఖలో పేర్కొన్నారు.
రూ. 1000 కోట్లతో మైనార్టీ మంత్రిత్వ శాఖ ప్రతిపాదనలు ఇవే,విజయవాడ, గుంటూరు, నంద్యాల,విశాఖపట్నం, కడప, నెల్లూరు జిల్లా కేంద్రాలలో ఒక్కొక్క స్పోర్ట్స్ సెంటర్, ఒక్కొక్క దానికి రూ. 10 కోట్లు మొత్తం రూ. 60 కోట్లతో నిర్మాణం, రాష్ట్రంలోని 6 మేజర్ జిల్లా కేంద్రాలలో మినీ ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేయడం ద్వారా డెవలప్మెంట్ కం ప్రొడక్షన్ సెంటర్ల నిర్మాణాలకు రూ. 120 కోట్లతో నిర్మాణ ప్రతిపాదన.
గుంటూరు ఆటోనగర్, నంద్యాల ఆటోనగర్ లను అన్ని విధాలుగా ఉన్నతి, అభివృద్ధికి రూ. 40 కోట్లు వెచ్చింపుకు ప్రతిపాదన.
విశ్వకర్మ కింద మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఒనిపెంట( ఇత్తడి వస్తువులు ), ఏలూరు (కార్పెట్లు ), ఇంకొల్లు (వ్యవసాయ పనిముట్లు) గ్రామాలలో ఆయా వృత్తి నైపుణ్య దారుల సంక్షేమానికి రూ. 6 కోట్లతో అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన.
రాష్ట్రంలోని మసీదులు, దర్గాలు, చర్చిలు, జైన్ దేవాలయాలలో సోలార్ ప్లాంట్ లో ఏర్పాటుకు రూ.10కోట్లతో ప్రతిపాదన.
నంద్యాల/ అనంతపురం, కర్నూలు జిల్లాల పరిధిలో 2 మెగా సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణానికి రూ. 200 కోట్లతో ప్రతిపాదన.
ఉద్యానవన రంగ అభివృద్ధికి అనుకూలతలు ఉన్న నంద్యాలలో 100 ఎకరాలలో నర్సరీల ఏర్పాటు, మరో 100 ఎకరాలలో సేంద్రీయ వ్యవసాయానికి అవసరమయ్యే ఉత్పత్తుల కు రూ. 50 కోట్లతో ప్రతిపాదన.
రాష్ట్రంలో 21 సద్భావన మండపాల నిర్మాణాలకు ఒక్కొక్క దానికి రూ. 5 కోట్లు మొత్తం రూ. 105 కోట్లు తో ప్రతిపాదన.లి
రాష్ట్రంలో నిలిచిపోయిన నిర్మాణాల పూర్తికి రూ. 104 కోట్లతో నిర్మాణ ప్రతిపదన.
మైనారిటీ మంత్రిత్వ శాఖకు అనుబంధంగా విద్యా శాఖకు సంబంధించి పాత పనుల పునరుద్ధరణ, నైపుణ్య అభివృద్ధి, వైద్య రంగాల కోసం రూ. 300 కోట్లతో పనులు చేపట్టేందుకు డి పి ఆర్ లు రూపకల్పన.
మొత్తం రూ 995 కోట్ల ప్రతిపాదనలకు గాను కేంద్రం వాటా రూ.600 కోట్లు ఇవ్వాలని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు కు రాసిన లేఖలో రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కోరారు.

## పేదల నుండి ఇళ్ల పట్టాలు లాక్కున్న సంస్కృతి మాది కాదు.

# కొత్త సంస్కృతికి తెర లేపకండి..!

### -మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 20:
ప్రభుత్వాలు మారిన పేదల పక్షం నిలవాలని, అధికారం శాశ్వతం కాదని, ప్రభుత్వాలు మారిన వెంటనే పేదల ఇళ్లపట్టాలను లాక్కోవడం అనే సంస్కృతి తమది కాదని, కూటమి ప్రభుత్వం కొత్త సంస్కృతికి తెరలేపుతున్నదని వైఎస్ఆర్సిపి నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన నంద్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ మరియు జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ తో కలిసి నంద్యాల మండలం కానాల గ్రామంలో అర్హులైన పేదలకు ఇచ్చిన ఇళ్లస్థలాలను అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ స్థానిక నేతలు లాక్కోవడానికి ప్రయత్నిస్తూ, భయాందోళనలకు గురి చేస్తున్నారని వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. అనంతరం జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ కు వినతి పత్రం అందజేశారు.
ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ...నాటి ప్రభుత్వాలు అర్హులైన పేదలకు 1986 సంవత్సరంలో ప్రస్తుత మంత్రిగా ఉన్న ఫరూక్ నాడు ఎమ్మెల్యేగా ఉన్నారని వారి హయాంలో పేదలకు ఇళ్లపట్టాలను పంపిణీ చేశారని తెలిపారు. కానాల గ్రామంలో అనేకమంది అర్హులైన పేదలు గూడు లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితులలో ప్రభుత్వ భూములు లేని సందర్భంలో స్థానిక రైతులను ఒప్పించి ప్రభుత్వం ద్వారా భూములను సేకరించి అర్హులైన వారికి ఇళ్లపట్టాలను అందజేశామని తెలిపారు. అయితే నేడు స్థానిక నాయకులు గ్రామంలో అర్హులైన పేదలకు చెందిన ఇళ్లపట్టాలను లాక్కోవడానికి ప్రయత్నిస్తూ వారిని భయాందోళనకు గురి చేస్తున్నారని, ఇళ్ల స్థలాలు కావాలంటే డబ్బు ముట్ట జెప్పాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. కానాల ప్రాంతంలో స్థలాలకు అధిక డిమాండ్ ఉన్న కారణంగా స్థానిక కూటమి నాయకులకు ఈ స్థలాలపై కన్ను వేశారన్నారు. గూడు లేని ప్రతి పేదవానికి సొంతింటి కలను సహకారం చేయాలన్న సత్సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అర్హులైన వారికి జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి ఇళ్లస్థలాలను పంపిణీ చేశారని అన్నారు. పార్టీలకు కులాలకు రాజకీయాలకు అతీతంగా వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో పేదలకు ఇళ్లపట్టాలను అందించామని వారికి అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోమని పేదల పక్షాన నిలబడతామని హామీ ఇచ్చారు. పేదల ఇళ్ల పట్టాలను గుంజుకుంటున్న నాయకులపై చట్టపరమైన చర్యలను తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ను కోరడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉన్నత అధికారులు పేదల పక్షాన నిలిచి న్యాయం చేయాలని కోరారు. నాడు ఉన్న వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో అధికార యంత్రాంగం సిక్స్ స్టెప్ వాల్యుడేషన్ ఆధారంగా అర్హులైన వారికి ఇళ్లపట్టాలను పంపిణీ చేశామని తెలిపారు. ఇంకా గ్రామంలో అనేకమంది అర్హులైన పేదలు ఉన్నారని, ఇళ్ల స్థలాలు కొరతగా ఉన్న కారణంగా నాడు లాటరీ విధానంలో ఇళ్ల స్థలాలను పంపిణీ చేయడం జరిగిందని చెప్పారు. అధికారులు అర్హులైన పేదలకు ఇళ్లస్థలాలను ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం మారిన వెంటనే పట్టాలు లాక్కున్న సంస్కృతి గతంలో లేదని, నేడు కొత్త సంస్కృతికి



తెర లేపవద్దని కోరారు. ఎల్లప్పుడు ఒకే ప్రభుత్వం ఉండదని, ఇలా చేయడం సరికాదన్నారు. అధికారులు సమస్యను పరిష్కరించి పేదలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ దాల్మిల్ అమీర్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ విజయ శేఖర్ రెడ్డి , నంద్యాల వైసీపీ మండల అధ్యక్షుడు బసవేశ్వర రెడ్డి, జగదీశ్వర రెడ్డి, దేశం సుధాకర్ రెడ్డి, కానాల వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

# బిసి కులగణన చేపట్టాలి..!

### -జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు.

### -కర్నూలులో బీసీ సంఘాల నాయకుల రౌండ్ సమావేశం. -బీసీ సంఘాల, కుల సంఘాల నేతలు డిమాండ్.




ఆంధ్ర ప్రగతి కర్నూలు ఫిబ్రవరి 20:
ఆంధ్రప్రదేశ్ బి.సి కుల సంఘాల, బి.సి సంఘాల జె.ఎ.సి ఆధ్వర్యంలో బి. క్యాంప్ లోని బి.సి భవన్ కర్నూలులో బీసీ కులాల జనగణన చేపట్టాలనే డిమాండ్ తో రౌండ్ టేబుల్ సమావేశం , జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు ఆధ్వర్యంలో జరిగింది. రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేషంలో వివిధ కులసంఘాల నాయకులు మాట్లాడుతూ.. 1. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీ కులాల జనగణన చేపట్టాలి. 2. బీసీల జనాభా నిష్పత్తి ప్రకారం ఎవరి కుల జనాభా ఎంతో వారికి విద్య. ఉద్యోగ, ఉపాధి. రాజకీయ రంగాల్లో వారికి అంత వాటాలు కల్పించాలి. 3. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలి. 4. బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం విద్యా, ఉద్యోగ రంగాల్లో ఏబిసిడి వర్గీకరణ చేసిన విధంగానే రాజకీయ రంగాల్లో కూడా ఏబిసిడి వర్గీకరణ చేపట్టి ఎంబిసి కులాలకు న్యాయం చేయాలి. 5. ఇంతవరకు చట్టసభల్లో అడుగుపెట్టని ఎంబిసి కులాలకు రాజ్యసభ, ఎమ్మెల్సీ, రాష్ట్రస్థాయి నామినేటెడ్ చైర్మన్ పదవులు కేటాయించి సామాజిక న్యాయానికి పెద్ద పీట వేయాలి. 6. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ కుల కార్పొరేషన్లు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగింది.. లబ్దిదారుడికి రుణాలు కేటాయించే విషయంలో బ్యాంకులతో సంబంధం లేకుండా వివిధ బీసీ కుల కార్పొరేషన్ల ద్వారానే నేరుగ రుణాలు మంజూరుచేయాలి. 7. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టే బడ్జెట్ లో బీసీల అభివృద్ధికి, సబ్ ప్లాన్ అమలుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. పైన పేర్కొన్న డిమాండ్ల సాధనకు కార్యాచరణ రూపొందించుకుని దశల వారీగా ఉద్యమాన్ని చేపట్టాలని బీసీ సంఘాల, కుల సంఘాల నేతలు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువత కోసం నంద్యాలలో మెగా జాబ్ మేళా ఏర్పాటు.

### -ఉద్యోగ అవకాశాలు కల్పించనున్న ఎన్ ఎండి ఫిరోజ్.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 20: ఈ మెగా జాబ్ మేళకు ప్రముఖ 30కు పైగా కంపెనీలను నంద్యాలకు రప్పించి 3 వేల మంది యువతి యువకులకు ఉద్యోగాలు కల్పిస్తాం అని నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి ఫిరోజ్ అన్నారు. నంద్యాల జిల్లాలో నిరుద్యోగ సమస్యను తగ్గించి యువతకు ఉద్యోగ అవకాశాలను అందించాలనే సదుద్దేశంతో ఫిరోజ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర మంత్రి ఎన్ ఎండి ఫరూక్ ఆదేశాల మేరకు తమ స్వంత నిధులతో భారీ మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసి, 30కి పైగా ప్రముఖ కంపెనీలను నంద్యాలకు రప్పించి 3,000 మంది యువతి యువకులకు ఉపాధి కల్పించబోతున్నారు. ఈ గొప్ప కార్యక్రమానికి సంబంధించి నంద్యాల జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్ రెడ్డి తో కలిసి తెలుగుదేశం పార్టీ నంద్యాల అసెంబ్లీ కార్యాలయంలో చర్చించి, పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ఒక మంచి ఉద్యోగం మారుమూల పేద కుటుంబాన్ని సైతం పేదరికం నుండి వెలుగులోకి తెచ్చే శక్తి కలిగిఉంటుందన్నారు. నిరుద్యోగాన్ని తుడిచిపెట్టే మార్గం ఒక్కటే %-% సరైన ఉద్యోగ అవకాశాన్ని అందించడమేనని అన్నారు. నంద్యాల నిరుద్యోగ యువతియువకులకు ఒక అన్నలా వారికి ఉపాధి అవకాశాలు కల్పించి వారికి తోడుగా ఉంటానని హామీనిచ్చారు. నంద్యాల జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఎన్ ఎండి ఫిరోజ్ చేస్తున్న ఈ గొప్ప ప్రయత్నం నంద్యాల యువత జీవితాలను మార్చే పరివర్తనకు నాందిలామారుతుందని తెలిపారు. అతి త్వరలో మెగా జాబ్ మేళా పూర్తి వివరాలు తెలియజేస్తామని తెలిపారు.

## ఘనంగా సునీత & మదర్ తెరిసా ఒకేషనల్ మరియు

# రాఘవ పారామెడికల్ ఇన్స్టిట్యూట్ 5 వ వార్షికోత్సవం.

### -ఫేరవల్ పార్టీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎన్ఎండి ఫిరోజ్.












ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ ఫిబ్రవరి 20:
సునీత మరియు మదర్ తెరిసా ఒకేషనల్ మరియు రాఘవ పారామెడికల్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో 5 వ వార్షికోత్సవం మరియు ఫేవరల్ పార్టీ సెలబ్రేషన్స్ వేడుకలు నంద్యాల స్థానిక విశాల్ మార్ట్ పైన ఉన్న ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్ హాల్ నందు జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ ఈ.కిరణ్ కుమార్ ఆయనను సన్మానించడం జరిగినది. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు ముఖ్యంగా ఒకేషనల్ విద్యార్థులకు కోర్సు పూర్తి అయిన వెంటనే గవర్నమెంట్ హాస్పిటల్ యందు ఒక సంవత్సరం అప్రెంటిషిప్ ట్రైనింగ్ లో కనీసం స్టైఫెండ్ ఇచ్చే విధంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ దృష్టికి తీసుకువెళ్లి విద్యార్థులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు టిడిపి ఇన్చార్జ్ ఉప్పర సురేష్ కుమార్, బద్రిశెట్టి రవి, గోవింద నాయుడు, మరాఠీ సూరి, ఇసుక చాంద్, ముర్తుజా వలి తదితరులు పాల్గొన్నారు.

# సమాజ శ్రేయస్సు కోసం ప్రజా చైతన్యం కోసం పాత్రికేయులు పనిచేయాలి.

### - నంద్యాల త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ కంబగిరి రాముడు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 20: నంద్యాల పట్టణంలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ నందు ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన కంబగిరి రాముడు సిఐని మన దండోరా తెలుగు దినపత్రిక పాత్రికేయులు మర్యాదపూర్వకంగా కలిసి 2025 క్యాలెండర్ ను అందించారు. ఈ సందర్భంగా సిఐ కంబగిరి రాముడు మాట్లాడుతూ పాత్రికేయులు సమాజ శ్రేయస్సు కోసం ప్రజా చైతన్యం కోసం వార్తలు సేకరిస్తూ పనిచేస్తున్న విధానాన్ని ప్రత్యేకంగా అభినందిస్తూ నేటి సమాజంలో జరుగుతున్న అసాంఘిక శక్తుల బారిన పడకుండా పోలీస్ యంత్రాంగం అనేక పద్ధతుల్లో అవగాహన సదస్సులు ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తుండం జరుగుతుందని. మూడవ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ కంబగిరి రాముడు గుర్తు చేశారు. ప్రజలను చైతన్య పరిచే ప్రతి అవగాహన కార్యక్రమాలను ప్రజల వద్దకు చేర్చేందుకు పాత్రికేయుల పాత్ర అభినందించదగ్గ విషయం అన్నారు. సమా సమాజంలో యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా విద్యపై శ్రద్ధ చూపిస్తూ చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రత్యేకంగా కోరుతూ.యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రాష్ డ్రైవింగ్,మద్యం సేవించి వాహనాలు నడపరాదని,ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించి ప్రమాదాలను నివారించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని ప్రజలను యువతను ప్రత్యేకంగా యువతను కోరారు.ప్రతి ఒక్కరూ చట్టాలను క్షుణ్ణంగా తెలుసుకొని సమాజంలో జరుగుతున్న ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తూ నేరాలు లేని సమాజంగా తీర్చిదిద్దాలని అందుకు ప్రతి పౌరునికి బాధ్యత ఉందని గుర్తు చేశారు.అలాగే నేరాలకు పాల్పడే చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, నంద్యాల మూడవ పట్టణ సీఐ కంబగిరి రాముడు హెచ్చరించారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రజల చైతన్యం కోసం పాత్రికేయుల పై ఎంతో బాధ్యత ఉందని గుర్తు చేస్తూ మన దండోరా తెలుగు దినపత్రిక క్యాలెండర్ ను పరిశీలించి యాజమాన్యాన్ని మరియు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తూ రానున్న రోజుల్లో పత్రిక ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నంద్యాల మూడో పట్టణ సిఐ కంబగిరి రాముడిని మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో నంద్యాల జిల్లా బ్యూరో యలనాటి జాషువా,నంద్యాల స్టాఫ్ రిపోర్టర్ ముస్కు రాజు,టౌన్ రిపోర్టర్ విజయ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక బడ్జెట్ ని వ్యతిరేకిస్తూ వామపక్షాల నిరసన.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 20:
కేంద్ర ఆర్థిక మంత్రి ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన బడ్జెట్ సంపన్నుల కోసం ఉందని సామాన్యుల సంక్షేమం మరిచి సామాన్యులపై భారాలు వేయడమే పనిగా పెట్టుకుని పేదల నడ్డి విరుస్తున్న బడ్జెట్ కి కొన్ని ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పంపించడం జరుగుతుందని సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఎం నంద్యాల మండల కార్యదర్శి వెన్న బాల వెంకట్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు చౌడప్ప, రాంబాబు,ఆనంద్,సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కే మహమ్మద్ గౌస్,నరసింహ, వెంకట లింగం, సిపిఎం సీనియర్ నాయకులు తోట మద్దులు, పట్టణ కమిటీ సభ్యులు జైలాన్, ప్రజా సంఘాల నాయకులు సుబ్బారావు, ,వీరన్న, బుజ్జి, దస్తగిరి లతోపాటు మరో 80 మంది కార్యకర్తలు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ అధ్యక్షత వహించగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి. రమేష్ కుమార్ నిరసన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడుతూ వ్యవసాయం అనుబంధ రంగాలకు కేటాయింపులు పెంచాలని,జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి 50% కేటాయింపులు పెంచాలని,మున్సిపల్ పట్టణంలో ఉపాధిహామి పథకం ప్రారంభించాలని,దళిత, గిరిజన సంక్షేమానికి, మహిళా సంక్షేమానికి కేటాయింపులు పెంచాలని,జి.డి.పిలో ఆరోగ్యానికి 3%, విద్యారంగానికి 6% కేటాయింపులు పెంచాలని,ప్రజాపంపిణీ కేటాయింపులు పెంచి, ఆహారభద్రత చట్టాన్ని అమలు చేయాలని,ప్రభుత్వ ఆస్తులను ప్రవేటు రంగానికి బదలాయించటాన్ని ఆపాలని,భీమా రంగంలో 100% ఎఫ్డిఐలను ఉపసంహరించాలని,రాష్ట్రాలకు నిధుల బదిలీని పెంచాలని, కేంద్ర ప్రయోజిత పతకాలకు కూడా నిధులను పెంచాలని,కేంద్రం రాష్ట్రాలతో పంచుకునే విభాగంలో చేర్చని పెట్రోలియం ఉత్పత్తులపై సెస్సులను, సర్ చార్జీలను రద్దుచేయాలని దేశంలో ఉన్న ఒక శాతం సంపన్నుల పైన నాలుగు శాతం పన్ను విధిస్తే దేశం లోని కార్మికులకు రైతులకు వ్యవసాయ కార్మికులకు ప్రజలకు సంక్షేమాన్ని అందించవచ్చని అలా కాకుండా సంపన్నుల అప్పులను మాఫీ చేయడం కోసం వారికి మరిగిన రుణాలను అందించడం కోసం దేశ సంపదను దోచుకోవడం కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్, దుర్మార్గంగా ఉందని వెంటనే వామపక్ష పార్టీలు ప్రవేశపెట్టిన ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేయాలని లేకుంటే రాబోయే కాలంలో ప్రజా వ్యతిరేకత వెల్లువై కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.

# ఏపీ మోడల్ స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.




ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఫిబ్రవరి 20: గోస్పాడు మండల కేంద్రంలో ని ఏపీ మోడల్ స్కూల్ ను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. పాఠశాల పరిసర ప్రాంతాలు, తరగతి గదులను శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆర్ఓ ప్లాంట్‌లో లీకేజీ సమస్యను గుర్తించి మరమ్మతులు చేయించాలని కలెక్టర్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలోని గ్రంథాలయాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పుస్తకాలు, కుర్చీలు, ర్యాక్లు వంటి లైబ్రరీ సామాగ్రి తప్ప ఎటువంటి వస్తువులు ఉంచకూడదన్నారు. పాఠశాలలో ఇంకా మిగిలిపోయిన స్కూల్ బ్యాగులను పరిశీలిస్తూ పాఠశాలకు ఎన్ని సంచులు ఇండెంట్ చేయబడ్డాయి? ఎన్ని సంచులు పంపిణీ చేయబడ్డాయి? ఎన్ని సంచులు మిగిలి ఉన్నాయి? సంచులు ఎందుకు ఎక్కువగా ఇండెంట్ చేయబడ్డాయి? వీటిపై సవివరమైన నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో రైటింగ్ ప్యాడ్ లేకుండా కుర్చీలను ఉపయోగించే విద్యార్థులతో పరీక్ష నిర్వహించే అంశంపై నివేదిక ఇవ్వాలన్నారు. పాఠశాలలోని ల్యాబ్ గదులన్నింటికీ తాళాలు వేయకుండా వాటిని క్రమం తప్పకుండా వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలోని వైద్యశాలతో పాటు మెట్ల పక్కన గదులను శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాల పరిసరాల్లో చెల్లాచెదురుగా వున్న ఐఫీపీ బాక్స్‌లను శుభ్రం చేయడంతో పాటు ఆవరణను చక్కగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# శ్రీ శాంతి నికేతన్ పాఠశాలలో ఘనంగా మ్యాథ్స్ డే కార్యక్రమం.




ఆంధ్రప్రగతి నంద్యాల ఫిబ్రవరి 20: నంద్యాల పట్టణంలోని క్రాంతి నగర్ నందలి శ్రీ శాంతినికేతన్ సి.బి.ఎస్.ఈ విద్యా సంస్థల యందు గురువారం నాడు మ్యాథ్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పైథాగరస్ సిద్ధాంతం, టైప్స్ ఆఫ్ ట్రయాంగిల్స్, టైప్స్ ఆఫ్ యాంగిల్స్ , ఎల్సిమ్ %ఴ% హీసీఎఫ్, క్యాలిక్యులేషన్ విత్ అబాకస్ ఫ్రేమ్, బిఫోర్- ఆఫ్టర్ నంబర్స్, త్రికోణమితి - మన నిత్యజీవితంలో ఉపయోగం లాంటి ప్రాజెక్టులుబీ గణితానికి సంబంధించిన మరియు హాస్యమునకు సంబంధించిన సాంస్కృతిక కార్యక్రమాలు, మెదడుకు మేత మొదలైనటువంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ప్రదర్శించిన కార్యక్రమాలలో శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్ జీవిత చరిత్రకు సంబంధించిన విషయం కొసమెరుపుగా మెరిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనటువంటి శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ మ్యాథ్స్ అనేది ఒక సబ్జెక్టు లాగా కాకుండా నిత్యజీవితంలో ఒక భాగం లాగా భావించాలన్నారు. ఈ మ్యాథ్స్ బట్టి విధానంలో కాకుండా ప్రాక్టికల్ గా నేర్చుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా క్లాస్ రూమ్ నాలెడ్జ్ మాత్రమే గాక ప్రాక్టికల్ నాలెడ్జి కూడా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# సకాలంలో పి4 సర్వే పూర్తి చేస్తాం.!

## -వీడియో కాన్ఫరెన్స్ లో సీఎస్ కె.విజయానంద్ కి వివరించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఫిబ్రవరి 20:
జిల్లాలో పి4 సర్వే ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందికి పూర్తిస్థాయి శిక్షణనిచ్చి మార్గదర్శకాలు జారీ చేశామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వివరించారు. గురువారం ఏపీ సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఏపీపీఎస్సీ, గ్రూప్-2 పరీక్షలు, ఇంటర్మీడియట్ పరీక్షలు, పి4 సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ లు, సంబంధిత ఉన్నతాధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, డిఆర్ఓ రామునాయక్, సిపిఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ పి4 సర్వేపై గ్రామ వార్డు సచివాలయ సిబ్బందికి సంపూర్ణ శిక్షణనిచ్చి పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదించారు. అన్ని గ్రామాల్లో గురువారం నుండి పి4 సర్వే ప్రారంభమైందని కలెక్టర్ వివరించారు. ఈ సర్వేలో మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులను భాగస్వామ్యం చేసి సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. మార్చి




రెండో తేదీలోగా పి4 సర్వే పూర్తి చేసి సేకరించిన సర్వే వివరాలపై సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించుకుని నివేదిక సమర్పిస్తామని కలెక్టర్ నివేదించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షల కోసం త్వరగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. పరీక్షల ప్రశ్నాపత్రం మూమెంట్ ను పోలీసులు తనిఖీలు చేసేలా చర్యలు తీసుకోవాలని డివిఈఓ సునీతను కలెక్టర్ ఆదేశించారు. పరీక్షల కోసం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లో సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే పెండింగ్లో ఉన్న ఎంఎస్ఎంఈ సర్వే పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొనేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జవహర్ బాబును కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్డీఏ పిడి శ్రీధర్ రెడ్డి, జడ్పి డిప్యూటీ సిఈఓ సుబ్బారెడ్డి, భూగర్భ జల శాఖ డిడి రఘురాం, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి పై అప్రమత్తంగా ఉండండి- ఎంపిడిఓ.





ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల ఫిబ్రవరి 20: మండల పరిధిలోని ఆయా గ్రామాలలో గల గ్రామపంచాయతీ కార్యదర్శులు సమీపించిన వేసవినీ దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడి తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ సి శివమల్లేశ్వరప్ప పేర్కొన్నారు. శిరివెళ్ల మండలానికి చేతిపంపులకు సంబంధించిన మెటీరియల్ వచ్చినట్లు తెలిపారు. 10 టాప్ లు హ్యాండిల్ 15, పైపులు 200, బ్యారెల్స్ 15, బోరింగులకు (చేతిపంపులకు) సంబంధించిన ఇతర సామాగ్రి మండల కేంద్రానికి వచ్చినట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తెలియజేశారు.
మండల వ్యాప్తంగా 350 బోరింగ్ చేతిపంపులు ఉండగా అందులో కొన్ని మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్నట్లు ఆర్డబ్ల్యూఎస్ శాఖ ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని నీటి వనరులను నిరుపయోగంగా వృధాగా ఉంచకుండా వినియోగంలోకి తేచ్చి ప్రజలకు నీటి అవసరాలు తీర్చే విధంగా గ్రామపంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీఓ సూచించారు.

# ప్రభుత్వ కార్యాలయాల వద్ద టాయిలెట్ కష్టాలు.!



- -ప్రభుత్వ కార్యాలయాల వద్ద కానరాని మరుగుదొడ్లు..
- - అత్యవసరమైతే తప్పని తిప్పలు..!
- -నీళ్లు తాగడానికి కూడా భయపడుతున్న ఉద్యోగినులు.
- -సేవల కోసం వచ్చే ప్రజలకు తప్పని తిప్పలు.

ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల ఫిబ్రవరి 20:
బహిరంగ మలమూత్ర విసర్జన గ్రామాల లక్ష సాధన లక్ష్యమని ఊదరగొడుతున్న ప్రభుత్వం స్వచ్ఛభారత్, స్వచ్ఛ గ్రామాల వంటి పథకాలు అమలు పరచాలంట్లు చేస్తున్న అధికారులు కార్యాలయాల వద్ద మరుగుదొడ్లు నిర్మించడంలో నిర్లక్ష్యం ఉండడంతో కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల వసతులు లేమితో కొట్టుమిట్టాలాడుతున్నాయి నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే ప్రభుత్వ కార్యాలయాల వద్ద బాత్రూములు, పబ్లిక్ టాయిలెట్స్ లేవు. దీంతో నిత్యం ప్రజలతో పాటు కార్యాలయాల్లో కనిపించే సిబ్బంది చెప్పుకోలేని బాధతో సతమతమవుతున్నారు. చాలామంది ఆయా కార్యాలయాలలో పనిచేసే మహిళ సిబ్బంది ఆఫీసుకు వచ్చిన మొదలు భోజనం చేసే సమయంలో మినహా ఇంటికి వెళ్లేంతవరకు మంచినీళ్లు తాగేందుకు కూడా భయపడుతున్నారంటే సిరివెళ్ల మండల ప్రభుత్వ కార్యాలయంలో



పరిస్థితి అలా ఉంది. మండల కేంద్రంలో తాసిల్దారు ,ఎంపీడీవో, వెలుగు, హౌసింగ్ ,తదితర కార్యాలయాలు ఒకే చోట ఉండడంతో ప్రతినిత్యం ఆయా కార్యాలయాలకు వివిధ రకాల సమస్యల పరిష్కారం వచ్చే ప్రజలతో అన్ని కార్యాలయాలు జనసంద్రంగా ఉండడంతో ముఖ్యంగా కార్యాలయంలో బాత్రూంలు లేని పరిస్థితి నెలకొంది. దీంతో సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలతో పాటు కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం మీద సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రజలు కోరుకుంటున్నారు.

# ఎల్ఐసి లో నూతన నియామకాలు చేపట్టాల్సిందే.!

- -మెజారిటీ సంఘానికి గుర్తింపు పునరుద్ధరించాల్సిందే.
- -దేశవ్యాప్త ఒక్క గంట ఎల్ఐసి సిబ్బంది సమ్మె జయప్రదం.
- -సమ్మె సందర్భంగా వివిధ ఉద్యోగ సంఘాల నేతలు.




ఆంధ్రప్రగతి నంద్యాల ఫిబ్రవరి 20:
ఎల్ఐసి లో గత ఏడేండ్లలో 15 వేల మంది ఉద్యోగులు తగ్గిందని, సంస్థ కోసం పాలసీదారుల కోసం తక్షణం నూతన నియామకాలు చేపట్టాల్సిందేనని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నంద్యాల కార్యదర్శి రమేష్ బాబుడిమాండ్ చేశారు. స్థానిక ఎల్ఐసి కార్యాలయం ఎదుట బ్రాంచ్ అధ్యక్షుడు వి. ఎస్. ఆర్. శుక్ల ఆధ్వర్యంలో జరిగిన ఒక గంట దేశవ్యాప్త సమ్మె కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ ఇన్సూరెన్స్ రంగం రూపురేఖలు మారిపోతున్న దశలో, నూతన తరం పాలసీదారుల ఆకాంక్షల మేరకు పనిచేయాలంటే ఉన్నత విద్యావంతులైన, హైటెక్ పరిజ్ఞానం ఉన్న యువత నూతన ఉద్యోగులుగా నియమించుకోవాల్సిన అవసరం ఎల్ఐసి కి ఉందని అన్నారు. జవాబుదారీతనం లేని ఔట్సోర్సింగ్ స్థానంలో రెగ్యులర్ నియామకాలే పరిష్కారమన్నారు. యూపీఎస్సీ తరహాలో ప్రతి ఏటా ఎల్ఐసి లో అవసరమైన మేరకు నియామకాలు చేపట్టాలన్నారు. దేశంలో ఉన్న 80 శాతం ఎల్ఐసి సిబ్బందికి ప్రాతినిధ్యం వహిస్తున్న తమ సంఘం ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) కు గుర్తింపు పొందిన సంఘంగా హోదాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సంస్థ కోసం, పాలసీదారుల కోసం, సిబ్బంది కోసం విషయాల దృక్పథంతో పనిచేస్తున్న అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం భారత కార్మికోద్యమ చరిత్రలో ఆదర్శప్రాయమైనదని, ఆ సంఘానికి గుర్తింపు పునరుద్ధరించడమంటే సంస్థలో ప్రజాస్వామిక సాంప్రదాయాలు నిలపడమేనని, అలాగే నూతన నియామకాలు కూడా చేపట్టాలని ఎల్ఐసి ఏజెన్సీ నాయకులు ఎం. శ్రీనివాస్ రెడ్డి, రామచంద్రమూర్తి, డి. తిరుపాలు, ఉమామహేశ్వర్ రెడ్డి, శ్రీరాములు, కుమ్మిత శ్రీనివాసులు సంఘీభావం తెలిపారు, అలాగే సంస్థలోని వివిధ తరగతుల సంఘాల నాయకులు పుల్లారెడ్డి, మాట్లాడుతూ బలమైన ఎల్ఐసి మాత్రమే బలమైన దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైనదని, ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఎల్ఐసి యాజమాన్యం ఏకపక్ష ధోరణులు మాని ప్రజాస్వామికంగా వ్యవహరించాలన్నారు. ఈ ఒక్క గంట సమ్మె కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఏ.భువనేంద్ర, రామకృష్ణుడు, శేషగిరిరావు, రంగారావు, సత్యనారాయణ, వెంకటరాముడు, గోపాల్ తదితర నాయకులందరూ పాల్గొన్నారు.

# అధిక ధరలకు యూరియా అమ్మితే చర్యలు

ఆంధ్ర ప్రగతి మహానంది ఫిబ్రవరి 20:
ఎరువుల డీలర్లు యూరియాను నిల్వ చేసి, అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, అనుమతి ఉన్న ఎరువులు మాత్రమే అమ్మాలని మండల వ్యవసాయ అధికారి బి. నాగేశ్వరరెడ్డి హెచ్చరించారు. గురువారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని దీప్తి ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, గఫారియా పెస్టిసైడ్స్ ఎరువులు,పురుగు మందుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎరువుల డీలర్లు ఎరువుల నియంత్రణ చట్టం 1985 ప్రకారమే వ్యాపారం చేయాలని , యూరియాను గరిష్ట చిల్లర ధర కంటే అధిక ధరకు అమ్మితే చట్ట ప్రకారము కఠిన చర్యలు తీసుకుంటామని



హెచ్చరించడం జరిగిందన్నారు. ప్రతి రైతుకు విధిగా బిల్లులు అందజేయాలని, రైతుకు ఫారం ఎం లోనే బిల్లులు ఇవ్వాలని, అనుమతి ఉన్న ఎరువులు మాత్రమే రైతులకు అమ్మాలని తెలిపారు. ఎరువుల డీలర్లు స్టాక్ రిజిస్టర్లో వివరాలు సక్రమంగా పొందుపరచాలన్నారు.




ప్రతిరోజు ఎరువుల ధరల పట్టిక నందు, ఎరువుల ధరలు చూపించాలన్నారు. మండలంలో రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్ సొసైటీ ల ద్వారా ఎరువులు అందజేస్తున్నామని తెలిపారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# సౌర విద్యుత్ పెరిగితేనే సమస్యకు పరిష్కారం !



ఫిబ్రవరి 20 ఆంధ్ర ప్రగతి:
మార్చి రాకముందే రాష్ట్రంలో ఎండలు దంచికొడ్తున్నాయి. ఇటు గృహవినియోగంతో పాటు వ్యవసాయం, పరిశ్రమలకు విద్యుత్ వినియోగం క్రమంగా పెరుగుతున్నది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ ఎండాకాలం క రెంట్ వినియోగం పెరగగలదని అంచనాలు ఉన్నాయి. అయితే డిమాండ్‌కు తగ్గట్లుగా ఉత్పత్తి సామర్థ్యం ఇంకా పెరగలేదు. రెండు రాష్ట్రాల్లోనూ పవర్ ప్రాజెక్టులు అందుబాటులోకి రావాల్సి ఉంది. పిఎం సూర్య ఘర్ యోజనకింద ఇప్పుడిప్పుడే ప్రతి ఒక్కరూ సౌర విద్యుత్ కోసం దరఖాస్తులు చేస్తున్నారు. ప్రభుత్వాలు కూడా పెద్ద ఎత్తున సౌర విద్యుత్ ప్రోత్సహిస్తే పెట్టుబడి తగ్గడంతో పాటు, ఉత్పత్తి పెరిగి, గ్రామాలకు రక్షగా ఉంటుంది. అయితే ఈ పథకంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన రావాల్సి ఉంది. అలాగే పెద్దపెద్ద కమ్యూనిటీలు సౌర విద్యుత్ ఫలకాలు వాడకాన్ని తప్పనిసరి చేయాల్సి ఉంది. అలాగే ఉచిత విద్యుత్ కారణంగా వ్యవసాయ విద్యుత్ డిమాండ్ కూడా పెరుగుతోంది. వ్యవసాయ విద్యతు÷-÷-పై అజమాయిషీ, ఆడట్ లేకపోవడంతో అక్కడ ఎంత ఖర్చు చేస్తున్నారన్న దానికి సమాధానం లేదు. ఎపిలో స్మార్ట్ మీటర్లు పెట్టి విద్యుత్ వినియోగం అంచనా వేయాలన్న ప్రయత్నాలపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో ఇప్పుడు స్మార్ట్ మీటర్ల ప్రతిపాదన వెనక్కి పోయింది. ఇకపోతే వ్యవసాయ విద్యుత్ ఇతర రంగాలకు వినియోగి స్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎవరికి ఎంత పొలం ఉంది..ఏయే పంటలు పండిస్తున్నారన్న ఆడిట్ కూడా జరగడం లేదు. పంటలకు అనుగుణంగా విద్యుత్ వాడకం ఎంత జరిగిందన్న దానికి లెక్కలు లేవు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇదే సమస్య ఉంది. ఇకపోతే ఇప్పటికే వరుసగా కోతలు అవస్థలు పెడుతున్నాయి. అప్రకటిత కరెంట్ కోతలు చికాకు కలిగిస్తున్నాయి. తెలంగాణలో అప్రకటిత కోతలు నడుస్తున్నాయి. ఎప్పుడు సడన్‌గా కరెంట్ పోతుందో తెలియడం లేదు. కరెంట్ వినియోగంలో ముందున్న తెలంగాణ రాష్ట్రం.. ఉత్పత్తిలో మాత్రం వెనుకబడిపోయింది. దీంతో బయట ఎక్కువ రేటు పెట్టి కరెంట్ కొనాల్సిన పరిస్థితి నెలకొంది. గత పదేండ్లలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోకపోవడం వల్లే ఈ సమస్య తలెత్తిందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ప్రతిరోజు సగటున 300 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం పడుతుండగా, అందులో మన దగ్గర ఉత్పత్తి అయ్యేది115 మిలియన్ యూనిట్లు మాత్రమేనని తెలుస్తోంది. మిగిలిన 185 మిలియన్ యూనిట్లు అంటే 60 శాతానికి పైగా ఇతర రాష్ట్రాలు, పవర్ ఎక్ఛేంజ్‌ల నుంచి కొనాల్సి వస్తున్నది. విద్యుత్ డిమాండ్ పెద్దగా లేని సమయాల్లో యూనిట్‌కు రూ.2.50 రేటుతో కరెంట్ దొరుకుతున్నప్పటికీ.. డిమాండ్ పీక్స్‌కు చేరే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో యూనిట్‌కు రూ.10 నుంచి రూ.20 దాకా పెట్టి కొనాల్సి వస్తున్నది. దీని వల్ల ఈ మూడు నెలల కాలంలో మన విద్యుత్ పంపిణీ సంస్థలపై, తద్వారా రాష్ట్రంపై రూ.3వేల కోట్లకుపైగా అదనపు భారం పడనుంది. గతేడాది మార్చి 8న అత్యధికంగా 15,623 మెగావాట్ల డిమాండ్?నమోదు కాగా, ఈసారి ఫిబ్రవరి10వ తేదీనే 15,998 మెగావాట్ల డిమాండ్ తో గత రికార్డులన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. ఈసారి యాసంగి సాగు విపరీతంగా పెరగడంతో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో డిమాండ్ 17వేల మెగావాట్లకు చేరుకుంటుందని విద్యుత్ శాఖ అంచనా వేస్తున్నది. కొద్ది రోజులుగా రాష్ట్రంలో 300 మిలియన్‌యూనిట్ల దాకా వినియోగం జరుగుతుండగా, అందులో మన దగ్గర ఉత్పత్తి అయ్యేది కేవలం 115 మిలియన్ యూనిట్లు మాత్రమే. తెలంగాణ జెన్‌కో విద్యుత్‌కేంద్రాల నుంచి 82ఎంయూలు, సింగరేణి నుంచి 27ఎంయూలు, హైడల్ ద్వారా8 ఎంయూలకు అటు ఇటుగా ఉత్పత్తి జరుగుతున్నది. దీంతో సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్ సహా వివిధ పవర్ ఎక్ఛేంజీల నుంచి సుమారు 185 ఎంయూల దాకా కొనాల్సి వస్తున్నది. తెలంగాణ ఏర్పడే నాటికి జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 5,405 మెగావాట్లు ఉండగా, ప్రస్తుతం 7,285 మెగావాట్లకు చేరింది. అంటే గడిచిన పదేండ్లలో జెన్‌కో సామర్థ్యం కేవలం 1,880 మెగావాట్లు మాత్రమే పెరిగింది. తెలంగాణ వచ్చాక 1,080 మెగావాట్ల కెపాసిటీతో భద్రాద్రి థర్మల్ ప్లాంట్, 4వేల మెగావాట్ల సామర్థ్యంతో యాదాద్రి పవర్ ఎ÷-లాంట్ల నిర్మాణాన్ని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టింది. వీటిలో ప్రస్తుతం భద్రాద్రిలోని1,080 మెగావాట్ల థర్మల్ ప్లాంట్?తో పాటు యాదాద్రిలోని 5 యూనిట్లలో 800 మెగావాట్ల ఒక యూనిట్ మాత్రమే పూర్తయింది. దీంతో కొత్తగా కేవలం1,880 మెగావాట్ల పవర్ అందుబాటు లోకి వచ్చింది.ప్రస్తుతం జెన్‌కో సామర్థ్యం 7,285 మెగావాట్లు కాగా.. డిమాండ్ మాత్రం 15వేల మెగావాట్లను దాటుతుండడంతో బయట కొనుగోలు చేయక తప్పడం లేదు. గత డిసెంబర్, జనవరి నెలల్లో ఒక్కో యూనిట్‌కు సరాసరి రూ.2.69 నుంచి రూ.2.89 మధ్య పవర్ ఎక్ఛేంజీల నుంచి టీజీ ట్రాన్స్‌కో కరెంట్ కొనుగోలు చేసింది. ఇలా డిమాండ్ పెద్దగా లేనప్పుడు యూనిట్‌కు సగటున రూ.2.50కు దొరికే కరెంట్.. డిమాండ్ ఎక్కువగా ఉండే రాబోయే మూడు నెలల్లో యూనిట్ రేటు రూ.10 నుంచి రూ.20 దాకా చేరవచ్చని ట్రాన్స్‌కో అధికారులు అంటున్నారు. ప్రస్తుతం ఇండియన్ ఎనర్జీ ఎక్ఛేంజ్ ద్వారా దక్షిణాది రాష్ట్రాల్లో అమ్ముతున్న కరెంట్‌లో 90 శాతానికి పైగా తెలంగాణే కొంటున్నది. ఎండాకాలం మొదలై మిగతా రాష్ట్రాలు కూడా పోటీ పడితే పవర్‌ఎక్ఛేంజీలో ధరలు ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంది. ఆయా నెలల్లో విద్యుత్ కొనుగోళ్లపై ఏకంగా ప్రతినెలా రూ.వెయ్యి కోట్ల చొప్పున రూ.3వేల కోట్ల అదనపు భారం పడుతుందని అధికారులు చెప్తున్నారు. ఈ క్రమంలో సౌర విదయుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాల్సి ఉందని నిపుణులు చెబుతున్నారు. సౌర విద్యుత్ ఉత్పత్తితో గ్రీన్ ఎనర్జీకి అవకాశాలు ఉన్నాయి. ఇటీవల ఎపి సిఎం చంద్రబాబు నాయుడు గ్రీన్ ఎనర్జీపై ఫోకస్ పెట్టారు. దీనిని పెంచుకోగలిగితే విద్యుత్ రంగం స్వయం సమృద్ధి సాధించగలదు.

# ద్వారంపూడిలో అతిపెద్ద ఆదియోగి విగ్రహం

### కోయంబత్తూరు నమూనాలో ఏర్పాటు -శివరాత్రి రోజు ఆవిష్కరణ



రాజమండ్రిఫిబ్రవరి 20 ఆంధ్ర ప్రగతి:
తెలుగు రాష్టాల్లోనే అతిపెద్ద ఆదియోగి విగ్రహం ఏర్పాటయ్యింది. 60 అడుగుల ఎత్తు, 100 అడుగుల వెడల్పుతో ఈ విగ్రహాన్ని ఆంధ్రా శబరిమలగా ప్రసిద్ధిగాంచిన ద్వారపూడి అయ్యప్ప స్వామి ఆలయం వద్ద నిర్మించారు. మహాశివరాత్రి పర్వదినం రోజున ఈ విగ్రహాన్ని ప్రారంభించనున్నారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు ఈసా యోగా కేంద్రంలో ఉన్న ఆదియోగి విగ్రహ నమూనా ఆధారంగా అచ్చం అలాంటి విగ్రహాన్నే ద్వారపూడిలో ఏర్పాటు చేశారు. కోయంబత్తూరులో ఉన్న విగ్రహం 112 అడుగుల ఎత్తు, 82 అడుగుల వెడల్పులో ఉంటుంది. అదే నమూనాను బిక్కవోలు మండలం కొమరిపాలెం కు చెందిన శిల్పి పెద్ద రాఘవ బృందం పదినెలలు పాటు శ్రమించి ఈ విగ్రహాన్ని రూపొందించారు. సుమారు రూ.20 లక్షల వ్యయంతో పూర్తిగా సిమెంట్ తో ఈ విగ్రహాన్ని నిర్మించినట్లు ఆలయ గురుస్వామి ఎస్ఎల్ కనకరాజు తెలిపారు. ఇప్పటికే ద్వారపూడి అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో అరుదైన శివాలయం, వెంకటేశ్వర స్వామి ఆలయాలతో పాటు పదుల సంఖ్యలో ఆలయాలు రూపుదిద్దుకున్నాయి. ఇప్పుడు ఈ ఆదియోగి విగ్రహం ద్వారా ఈ ఆలయానికి మరింత ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మండపేట మండలానికి చెందిన ఈ ద్వారపూడి.. రాజమహేంద్రవరం నుంచి 20 కిలోమీటర్లు, అనపర్తికి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో సామర్లకోట కెనాల్ రోడ్ ను ఆనుకుని ఈ ఆలయం ఉంటుంది.

# శివుడికి పంచామృత అభిషేకకం శ్రేష్ఠం



శ్రీశైలం,ఫిబ్రవరి 20 ఆంధ్ర ప్రగతి:
పరమశివునికి అత్యంత పవిత్రమైన పండుగలలో శివరాత్రి ప్రధానమైనది. ఈ పండుగ భక్తులకు ఎంతో విశిష్టమైనది. ఈ పర్వదినాన శివుని ఆరాధించడం, శివలింగానికి పూజలు చేయడం ఎంతో పుణ్యప్రదమని నమ్ముతారు. ఈ సమయంలో శివలింగానికి అనేక పదార్థాలు సమర్పిస్తారు. వాటిలో పాలు ముఖ్యమైనవి. కొన్ని ప్రాంతాలలో పంచామృతంతో అభిషేకం చేస్తారు. పంచామృతం అంటే పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చక్కెర కలిపిన మిశ్రమం. మహాశివరాత్రి పూజలో భక్తి, శ్రద్ధ ముఖ్యమైనవి. శివునికి ప్రీతికరమైన పదార్థాలను సమర్పించి ఆయనను ప్రార్థించడం వల్ల మనోభీష్టాలు నెరవేరుతాయి. రాగి చెంబులో పాలు పోయకూడదనే నియమం గురించి తెలుసుకొని దానికి అనుగుణంగా పూజ చేయడం మంచిది. భక్తితో శివుని పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని విశ్వాసం. ఏదైనా సందేహం ఉంటే పూజారులు లేదా పెద్దల సలహా తీసుకోవడం మంచిది. అయితే రాగి చెంబులో పాలు పోసి శివలింగానికి సమర్పించకూడదని శాస్త్రాలు చెబుతున్నాయి.పాలు వస్తువులలోని నెగటివ్ ఎనర్జీని తొలగిస్తాయని నమ్మకం. అలాగే పాలు దాదాపు ప్రతి పూజలోనూ ఉపయోగిస్తారు. పాలు స్వచ్ఛతకు, పవిత్రతకు చిహ్నంగా భావిస్తారు. రాగి ఆరోగ్యానికి కూడా మంచిది. కానీ రాగికి కొన్ని పరిమితులు ఉన్నాయి. కొన్ని పదార్థాలతో రాగి చర్య జరుపుతుంది. పాలు ఏ వస్తువు నుండైనా నెగటివ్ ఎనర్జీని గ్రహిస్తాయి. రాగి చెంబు చుట్టూ ఏదైనా అశుద్ధం ఉంటే రాగి చెంబులో పాలు పోసినప్పుడు ఆ అశుద్ధం పాలతో కలిసిపోతుంది. దీనివల్ల పాలు అపవిత్రమవుతాయి. అలాంటి పాలను శివలింగానికి సమర్పించడం మంచిది కాదు. శివునికి సమర్పించే పాలు స్వచ్ఛంగా, పవిత్రంగా ఉండాలి. అందుకే రాగి చెంబులో పాలు పోసి శివలింగానికి సమర్పించకూడదు. హాశివరాత్రి రోజున శివుడిని భక్తితో పూజించడం వల్ల ఆయన అనుగ్రహం పొందవచ్చు. శివలింగానికి స్వచ్ఛమైన పాలతో అభిషేకం చేయడం ఎంతో పుణ్యప్రదమని భక్తులు విశ్వసిస్తారు. అయితే రాగి చెంబులో పాలు పోసి అభిషేకం చేయకూడదు. వేరే లోహపు పాత్రలో అంటే వెండి లేదా మట్టి పాత్రలో పాలు పోసి శివలింగానికి సమర్పించవచ్చు.

# హిమాలయాలకు వెళుతున్నారా


### ఢిల్లీ సిఎం ప్రమాణ కార్యక్రమంలో ఆసక్తికర సంఘటన

### పవన్ కళ్యాణ్ వస్త్రధారణపై మోడీ ఆశ్చర్యం నవ్వులు పూయించిన మోడీ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,ఫిబ్రవరి 20 ఆంధ్ర ప్రగతి:
దేశ రాజధాని హస్తినలో ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ఎపి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ వేషధారణ చూసి ప్రధాని మోడీ ఆశ్య పోయారు. సన్యాసం పుచ్చుకుని హిమాలయాలకు వెళుతున్నారా అంటూ చమత్కరించారు. ఢిల్లీ సిఎం ప్రమాణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా,
బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు ఎన్డీయే పాలిత రాష్ట్ర ముఖ్యమంత్రులు, ఎన్డీయే భాగస్వామ్య పక్షాల కీలక నేతలు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పవన్ కళ్యాణ్ దీక్షలో ఉండటంతో ప్రత్యేక దుస్తులతో ఈ కార్యక్రమంలో కనిపించారు. ప్రధాని మోదీ వేదికపైకి రాగానే అక్కడున్న నేతలను పలకరించారు. తొలుత గోవా సీఎం ప్రమోద్ సావంత్, ఆ తరువాత మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌కు నమస్కరిస్తూ ముందుకు సాగిన మోదీ, ఆ తర్వాత మహారాష్ట్ర మరో డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేను పలకరించారు. ఆ తర్వాత ఫడ్నవీస్‌తో పాటు మిగతా ఎన్డీయే భాగస్వామ్య పక్షాలకు నమస్కరించుకుంటూ ముందుకుసాగిన మోదీ.. పవన్ కళ్యాణ్ కనిపించగానే ఒక్కనిమిషం పాటు అలా ఆగిపోయారు. పవన్ వస్త్రాదారణ చూసిన మోదీ నవ్వుతూ హిమాలయాలకు వెళ్లామనుకుంటున్నావా అంటూ చమత్కరించారు. మోదీ మాటలకు పడిపడి నవ్విన పవన్ కళ్యాణ్ అలాంటిదేమి లేదంటూ సమాధానమిచ్చారు. వెంటనే నీ ముందు చాలా బాధ్యతలు ఉన్నాయి.. వాటిని చూసుకో అంటూ మోదీ పవన్ కళ్యాణ్ చేతిలో చేయి వేసి పలకరించారు. మోదీ మాటలకు పవన్ కళ్యాణ్ వెనుక ఉన్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సైతం నవ్వుతూ కనిపించారు. వేదికపై ఉన్నవారందరికి నమస్కరిస్తూ ముందుకుసాగిన మోదీ పవన్ వద్ద కొద్దిసేపు ఆగి.. ప్రత్యేకంగా మాట్లాడటంపై భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పవన్‌పై మోదీ మరోసారి తన అభిమానాన్ని చూపించారంటూ జనసైనికులు కామెంట్స్ చేస్తున్నారు. అయితే వేదికపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన వస్త్రధారణ చూసి పీఎం మోదీ సైతం ఆశ్చర్యపోయినట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం కోసం మాట్లాడుతున్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు జనసేన పోరాడుతుందని ప్రకటించారు. దేశ వ్యాప్తంగా హిందూ ఆలయాల పరిరక్షణ కోసం ప్రత్యేక సనాతన బోర్డు ఏర్పాటుచేయాలనే డిమాండ్‌ను పవన్ వినిపిస్తున్నారు. దీంతో పవన్ కళ్యాణ్ పేరు దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. సినీ నటుడిగా దేశవ్యాప్తంగా ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్న పవన్ కళ్యాణ్.. రాజకీయంగానూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు.
మొత్తానికి పవన్ కళ్యాణ్‌ను ప్రధాని మోదీ పలకరించడం.. దానికి నవ్వుతూ పవన్ కళ్యాణ్ సమాధానం ఇచ్చిన వీడియో వైరల్‌గా మారిపోయింది..అయితే, సోషల్ మీడియాలో పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్, జనసైనికులు ఆ వీడియోను షేర్ చేస్తూ.. అది పవన్ రేంజ్.. ప్రధాని మోడీ.. పవన్ కళ్యాణ్‌కు ఇచ్చే గౌరవం అంటూ కామెంట్లు పెడుతున్నారు.. ఇక, ప్రధాని-తన మధ్య జరిగిన చర్చను మీడియాకు వివరించారు పవన్ కళ్యాణ్.. కాషాయ దుస్తుల్లో వచ్చిన పవన్ కళ్యాణ్‌ను చూసి.. హిమాలయాలకు వెళ్తున్నారా? అని ప్రశ్నించారట ప్రధాని మోడీ.. దానికి ఇంకా సమయం ఉందంటూ సమాధానం ఇచ్చారట పవన్..

# డ్రగ్స్, నాటు సారా నివారణకు ప్రత్యేక చర్యలు




ఆంధ్ర ప్రగతి
మహానంది ఫిబ్రవరి 20:
డ్రగ్స్ మరియు నాటు సారా నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నంద్యాల ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి గురువారం పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గురువారం ప్రారంభించిన నవోదయ 2.0 కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా పూర్తి చేస్తామన్నారు. ఇందులో భాగంగా నంద్యాల జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ రవికుమార్ ఆదేశాల మేరకు అందరి సహాయ సహకారాలతో నాటు సారా , గంజాయి, వీటితోపాటు ఇతర హానికరమైన డ్రగ్స్ కు యువకులు మరియు ఇతరులు బానిసలు కాకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నాటు సారా, గంజాయి, సుంకం చెల్లించని మద్యం, డ్రగ్స్, అనధికార మద్యం క్రయ క్రియాలకు సంబంధించి సమాచారాన్ని అందజేస్తే దాడులు నిర్వహిస్తామన్నారు. సమాచారాన్ని అందజేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

# వల్లభనేని వంశీ కస్టడీ, హెల్త్ పిటిషన్లపై ముగిసిన వాదనలు

ఫిబ్రవరి 20 ఆంధ్ర ప్రగతి:
గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి, ఫిర్యాదుదారుడిని కిడ్నాప్ చేసిన కేసులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కస్టడీ, హెల్త్ పిటిషన్లను ఎస్సీ, ఎస్టీ కోర్టు ఈరోజు విచారించింది. గత రెండు రోజులుగా ఈ పిటిషన్లపై కోర్టులో వాదనలు జరిగాయి. ఈరోజు వాదనలు పూర్తయ్యాయి. తీర్పును రేపు వెల్లడిస్తామని కోర్టు తెలిపింది. జైల్లో బెడ్ సమకూర్చడం, ఇంటి నుంచి ఆహారం తెప్పించుకోవడానికి సంబంధించి రేపు కోర్టు తీర్పును వెలువరించనుంది.
వాదనల సందర్భంగా వంశీని ప్రత్యేక సెల్ లో ఎందుకు ఉంచారని న్యాయమూర్తి ప్రశ్నించారు. జైల్లో బ్లేడ్, గంజాయి బ్యాచ్ ఉన్నారని... మాజీ ఎమ్మెల్యే అయిన వంశీ భద్రత రీత్యా ఆయనను ప్రత్యేక సెల్ లో ఉంచామని జైలు సూపరింటెండెంట్ పాల్ కోర్టుకు తెలిపారు. మరోవైపు వంశీ బెయిల్ పిటిషన్ ను ఏపీ హైకోర్టు ఈరోజు కొట్టివేసింది.

# నేడు ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

## నారాయణపేట జిల్లా అప్పక పల్లెలో శ్రీకారం

హైదరాబాద్ : ఫిబ్రవరి 20 ఆంధ్ర ప్రగతి:
సిఎం రేవంత్ రెడ్డి నేడు ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేయనున్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో భాగంగా కీలకమైన ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై ప్రభుత్వం అన్నీ దఫాల వడబోత అనంతరం అర్హులను ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో నేడు (శుక్రవారం) సిఎం నారాయణపేట జిల్లా పర్యటన సందర్భంగా నారాయణపేట మండలంలోని అప్పకపల్లెలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేసి రాష్ట్రంలో మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 72,045 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, వాటికి నేడు శంకుస్థాపన పనులు మొదలు కానున్నాయి. ఇల్లు లేని కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వ సంకల్పంలో భాగంగా లబ్ధిదారులు సొంతంగా ఇల్లు కట్టుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తుంది. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల పూర్తి సబ్సిడీతో కూడిన ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించనుంది.మొదటి విడతలో 72,045 లబ్ధిదారుల ఎంపికరాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఉన్న పేదలు, ఇందిరమ్మ ఇళ్లు కట్టుకునేందుకు రూ.5,00,000ల చొప్పున నిధులను విడుదల చేయనుంది. ఈ నిధులను నాలుగు విడతల్లో లబ్ధిదారుడికి ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇందులో భాగంగా తొలి విడతలో లక్ష రూపాయలను లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయనుంది. లబ్ధిదారుల జాబితా ప్రస్తుతం ఇన్‌చార్జీ మంత్రుల చేతుల్లో ఉంది. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షిస్తు న్నారు. ఇందిరమ్మ ఇల్లు ఇప్పటివరకు 80 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా మొదటి విడతలో 72,045 లబ్ధిదారులను ప్రభుత్వం ఎంపిక చేసింది.శంకుస్థాపన కాగానే తొలి విడతగా రూ.లక్ష చెల్లింపు

నేడు ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన, భూమి పూజ చేసిన కుటుంబాలకు తొలి విడతగా ప్రభుత్వం రూ.లక్షను బ్యాంక్ అకౌంట్‌లలో వేయనుంది. ఆ డబ్బుతో పునాది వేసి గోడలు నిర్మించుకొని, కిటికీల ఎత్తువరకు గోడలను నిర్మించుకోవాల్సి ఉంటుంది. అప్పుడు అధికారులు పరిశీలించి, రెండో విడత నగదు పంపిణీని చెల్లిస్తారు. ప్రభుత్వం రెండో విడతగా రూ.1.25 లక్షలను లబ్ధిదారునికి ఇవ్వనుంది. ఆ డబ్బుతో ఇంటి నిర్మాణం




దాదాపు పూర్తవుతుంది. అయితే స్లాబ్ నిర్మాణం కోసం మరో రూ.1.75 లక్షలను ప్రభుత్వం చెల్లించనుంది. ఆ తర్వాత కరెంటు, బాత్రూం, నీటి సరఫరా ఇతరత్రా వాటికి మరో రూ.లక్షను ప్రభుత్వం లబ్ధిదారుడికి చెల్లిస్తుంది. ఇలా మొత్తం రూ.5 లక్షలను లబ్ధిదారుడికి ప్రభుత్వం వారి బ్యాంకు అకౌంట్‌లలో వేయనుంది.మొదటివిడతలో భాగంగా 4.5 లక్షల మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారుడికి సుమారుగా రూ.5 లక్షలను చెల్లించనుంది. మరో 4 సంవత్సరాల్లో మొత్తం 20 లక్షల ఇళ్లు నిర్మించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. అయితే ఎవరైనా ఈ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోకపోతే ప్రజా పాలనలో చేసుకోవచ్చు. దరఖాస్తు ఫారం నింపేవారు అందుకు సంబంధించిన పత్రాలు, జిరాక్స్ కాపీలను జత చేయాల్సి ఉంటుంది. ఇది నిరంతర ప్రక్రియ కావడంతో దీనికి చివరితేదీ లేదని ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వం దరఖాస్తు దారుల వివరాలను ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో నమోదు చేస్తోంది. అర్హుల వివరాలన్నీ ఆ యాప్‌లో నమోదై ఉంటాయి.

నేటి ముఖ్యమంత్రి పర్యటన వివరాలు ఇలా%ా.

%వికారాబాద్, నారాయణ పేట జిల్లాల్లో పలు అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. మధ్నాహ్నం 12 గంటలకు ముఖ్యమంత్రి వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం పోలేపల్లి గ్రామానికి చేరుకుంటారు. పోలేపల్లిలో రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయంలో జరిగే పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఆ తర్వాత నారాయణ పేట మండలం అప్పక్‌పల్లి చేరుకుంటారు అక్కడ జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తారు. బిపిసిఎల్ కంపెనీ సహకారంతో పూర్తిగా మహిళలచే నడిపే పెట్రోల్ బంక్ ఇది. రాష్ట్రంలోనే మొదటి సారి ఈ తరహా బంక్‌ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం అప్పక్ పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. నారాయణపేట మెడికల్ కాలేజీలో అకాడమిక్ బ్లాక్‌తో పాటు, ఇతర భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు గురుకుల హాస్టల్ ఆవరణలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు.

# లోక్‌పాల్ జారీ చేసిన ఉత్తర్వులపై స్టే

**న్యూ డిల్లీ :** హైకోర్టు న్యాయమూర్తులను విచారించే అధికారం ఉందని పేర్కొంటూ లోక్‌పాల్ జారీ చేసిన ఉత్తర్వులపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. లోక్‌పాల్ ఇచ్చిన ఆదేశాలపై ఈ సందర్భంగా సుప్రీంకోర్టు అసంతృప్తిని, ఆందోళనను వ్యక్తం చేసింది. ఇది చాలా ఆందోళనకరమైన విషయమని పేర్కొంది. న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యంపై కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. అదే సమయంలో లోక్‌పాల్ రిజిస్ట్రార్, హైకోర్టు న్యాయమూర్తిపై ఫిర్యాదు చేసిన వ్యక్తికి సైతం నోటీసులు ఇచ్చింది. వాస్తవానికి, హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తిపై వచ్చిన ఫిర్యాదును లోక్‌పాల్ విచారించింది.లోకాయుక్త చట్టం 2013 ప్రకారం హైకోర్టు న్యాయమూర్తులను విచారించే అధికారం ఉందంటూ జనవరి 27న ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకొని విచారణ చేపట్టింది. లోక్‌పాల్ ఉత్తర్వులపై స్టే ఇచ్చిన కోర్టు.. సదరు హైకోర్టు న్యాయమూర్తి పేరును బహిర్గతం చేయొద్దని, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ అభయ్ ఓకా ధర్మాసనం ఆదేశించింది. న్యాయమూర్తి పేరును గోప్యంగా ఉంచాలని ఫిర్యాదుదారుడికి స్పష్టం చేసింది. కేసు విచారణను మార్చి 18 వరకు వాయిదా వేసింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విచారణకు హాజరయ్యారు. హైకోర్టు న్యాయమూర్తులు లోక్‌పాల్, లోకాయుక్త చట్టం 2013 పరిధిలోకి ఎప్పటికీ రారని స్పష్టం చేశారు.జనవరి 27న, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్ నేతృత్వంలోని లోక్‌పాల్ తన ఉత్తర్వులో లోక్‌పాల్ చట్టం



ప్రకారం.. హైకోర్టు న్యాయమూర్తులు కూడా లోక్‌పాల్ పరిధిలోకి వస్తారని పేర్కొన్నారు. ఓ ఫిర్యాదుపై విచారణ సందర్భంగా ఆదేశాల్లో పేర్కొన్నారు. ఒక ప్రైవేట్ కంపెనీకి సంబంధించిన కేసులో సిట్టింగ్ హైకోర్టు న్యాయమూర్తి అదనపు జిల్లా న్యాయమూర్తి, మరొక హైకోర్టు న్యాయమూర్తిని ప్రభావితం చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. లోక్‌పాల్ ఆదేశాలను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకొని విచారణ జరుపుతున్నది. లోక్‌పాల్ వివరణ సైతం కోరింది.

# భారత్‌లో మరెవర్నో గెలిపించేందుకే ఆ నిధులు

**భారత్‌లో ఓటింగ్ శాతం కోసం మనమెందుకు ఖర్చు చేయాలి?**

**బైడెన్ ప్రభుత్వంపై ట్రంప్ ఆరోపణలు**

**వాషింటోన్ :** భారత్‌లో ఓటర్ల సంఖ్యను పెంచడానికి అమెరికా ప్రభుత్వం అందజేసే 21 మిలియన్ డాలర్లను ఇక నుంచి నిలిపివేస్తున్నట్టు ట్రంప్ యంత్రాంగంలో కీలక పాత్ర పోషిస్తున్న మస్క్ నేతృత్వంలోని డోజ్ విభాగం ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అంశం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నిధులు నిలిపివేతపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరోసారి స్పందించారు. ఈ మేరకు గత బైడెన్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.భారత్‌లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఉద్దేశించిన 21 మిలియన్ డాలర్ల నిధులతో అక్కడున్న 'మరెవరి' గెలుపు కోసమో బైడెన్ పనిచేశారని ఆయన ఆరోపించారు. బుధవారం రాత్రి మియామిలో నిర్వహించిన ఎఫ్ఐఐ ప్రియారిటీ సదస్సులో ట్రంప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిధుల అంశాన్ని ప్రస్తావించారు. భారత్‌లో ఓటింగ్ శాతం కోసం మనమెందుకు 21 మిలియన్ డాలర్లను ఖర్చు చేయాలి? అని ప్రశ్నించారు. ఆ దేశం (భారత్‌ను ఉద్దేశించి)లో మరెవర్నో గెలిపించేందుకు వారు (బైడెన్ ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ) ప్రయత్నించినట్లు అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. ఈ



విషయాన్ని భారత ప్రభుత్వానికి తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. అదే కీలక ముందడుగు అవుతుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. కాగా, నిధుల నిలిపివేత అంశంపై అంతకుముందు ఫ్లోరిడాలోని తన నివాసమైన మార్ ఎ లాగోలో ట్రంప్ మీడియాతో మాట్లాడారు. భారత్ వద్ద చాలా డబ్బులు ఉన్నాయని.. అలాంటప్పుడు ఇండియాకు 21 మిలియన్ డాలర్ల సాయం ఎందుకు చేయాలంటూ ప్రశ్నించారు. తనకు భారత ప్రజలు, ప్రధాని పట్ల ఎంతో గౌరవం ఉందని చెప్పారు. 'భారత్‌కు 21 మిలియన్ డాలర్లు ఎందుకు ఇవ్వాలి..? వారివద్ద చాలా డబ్బు ఉంది. ప్రపంచంలోనే అత్యధికంగా పన్ను విధించే దేశాల్లో భారత్ ఒకటి. వారు విధించే సుంకాలు కూడా చాలా ఎక్కువ. సుంకాల విషయంలో అమెరికా ఎన్నడూ భారత్‌ను చేరుకోలేదు. కానీ, వారి ఓటర్ల సంఖ్యను పెంచేందుకు మాత్రం మనం 21 మిలియన్ డాలర్లు ఇవ్వాలా..? మరి మన దేశంలో ఓటర్ల పరిస్థితి ఏంటి..?' అంటూ ట్రంప్ ప్రశ్నించారు.

## ఏడాదికి రెండు సార్లు సీబీఎస్ఈ పరీక్షలు

**న్యూఢిల్లీ :** విద్యార్థులకు సెంట్రల్ బోర్ట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) గుడ్‌న్యూస్ చెప్పింది. ఇకపై ఏడాదికి రెండు సార్లు బోర్డు పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించనుంది. అన్నీ కుదిరితే 2026 నుంచే ఈ విధానం కార్యరూపం దాల్చనున్నట్లు తెలుస్తుంది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అధ్యక్షతన స్కూల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి, సీబీఎస్ఈ, ఎన్సీఈఆర్టీ, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్), నవోదయ విద్యాలయ సమితి (ఎన్వీఎస్) ఉన్నతాధికారులతో మంగళవారం సమావేశం జరిగింది. దీనికి సంబంధించిన ముసాయిదాను ఏర్పాటుచేయగా.. వచ్చే సోమవారం నుంచి దీనిపై ప్రజాభిప్రాయాన్ని సేకరించనున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇది అమలులోకి వస్తే విద్యార్థులకు పరీక్షల స్ట్రెస్ ఇక ఉండదనే చెప్పాలి. అంతేకాదు వారి స్కోర్ మరింత పెంచుకోవడానికి కూడా అవకాశం ఉంటుంది. అంతేకాకుండా 2026-27 విద్యా సంవత్సరం నుంచి గ్లోబల్ కరిక్యులమ్ కూడా అందుబాటులోకి తీసుకురావలని సీబీఎస్సీ బోర్డు యోచిస్తుంది. అంటే ప్రపంచవ్యాప్తంగా అన్ని సీబీఎస్సీ అనుబంధ స్కూళ్లలో ఒకే విధమైన సిలబస్ ఉంటుందన్నమాట.ఏడాదికి రెండుసార్లు నిర్వహించే బోర్డు పరీక్షల్లో.. విద్యార్థులు ఏ పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధిస్తే, వాటినే పరిగణనలోకి తీసుకొంటారు. ఏడాదికి రెండుసార్లు బోర్డు పరీక్షలు నిర్వహించినా.. విద్యార్థులు రెండుసార్లూ పరీక్షలకు హాజరవ్వడం తప్పనిసరికాదు. జేఈఈ మాదిరిగా 10, 12 తరగతుల విద్యార్థులు కూడా బోర్డు పరీక్షలకు రెండుసార్లు హాజరవ్వొచ్చు. ఇది పూర్తిగా విద్యార్థుల ఛాయిస్. అలాగే ఇలా ఏడాదికి రెండుసార్లు బోర్డు పరీక్షల నిర్వహించడం వల్ల విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుందని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. సీబీఎస్ఈ పది, పన్నెండో తరగతి పరీక్షలను ప్రస్తుతం ఫిబ్రవరి-మార్చిలో నిర్వహించి మేలో ఫలితాలు వెల్లడిస్తున్నారు. ఫెయిలైన విద్యార్థులకు జూలైలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నారు.ఈ పరీక్షల్లోనే ఏదైనా ఒక సబ్జెక్ట్‌లో తమ మార్కులను మెరుగుపర్చుకోవడానికి పాసైన విద్యార్థులకూ అవకాశం కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ విధానం అమలులో ఉంది. అయితే తాజా విధానం అమల్లోకి వస్తే రెండు బోర్డు పరీక్షల మధ్య నిర్ణీత కాల వ్యవధి ఉంటుంది. అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ) ప్రవేశాలపై దీని ప్రభావం ఏ మాత్రం పడకుండా నూతన విద్యా క్యాలెండర్‌ను రూపొందించే అవకాశం ఉంది. దీంతో విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవడానికి తగిన సమయం లభిస్తుంది. ఏడాదికి 2 సార్లు బోర్డు పరీక్షలు నిర్వహించే విధానం 2026 నుంచి అమలు చేసేందుకు కేంద్రం ముమ్మర ఏర్పాట్లు చేస్తుంది.

## రైతులకు ఇచ్చిన హామీలు ఏవి



ఉత్తర్‌ప్రదేశ్ యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం 2025-2026 ఆర్థిక సంవత్సరానికి రూ. 8 లక్షల 8 వేల 736 కోట్ల 6 లక్షల బడ్జెట్‌ను ఈరోజు సమర్పించింది. ఇది 2024-2025 సంవత్సరపు బడ్జెట్ కంటే 9.8 శాతం ఎక్కువ కావడం విశేషం. అయితే ఈ బడ్జెట్‌పై ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి సంబంధించి అనేక హామీలు ఇచ్చినప్పటికీ, అవన్నీ నెరవేరలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు పెరిగిపోతున్నాయి తప్ప, రైతుల సమస్యలు మాత్రం అలాగే ఉంటున్నాయని అఖిలేష్ విమర్శించారు.

**ఈ హామీలు ఏవి..**

ఈ క్రమంలో రైతుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీల గురించి ప్రస్తావించారు అఖిలేష్ యాదవ్. బీజేపీ తన మ్యానిఫెస్టోలో రాబోయే ఐదు సంవత్సరాల్లో రైతులకు నీటిపారుదల కోసం ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చింది. కానీ ఈ హామీ నెరవేర్చలేదని అఖిలేష్ యాదవ్ అన్నారు. మరోవైపు సర్దార్ వల్లభాయ్ పటేల్ వ్యవసాయ మౌలిక సదుపాయాల మిషన్ కోసం రూ. 25 వేల కోట్లను కేటాయించడం. ఈ నిధుల ద్వారా రైతుల మౌలిక సదుపాయాలు మెరుగుపడే అవకాశం ఉన్నప్పటికీ, ఈ హామీ కూడా పూర్తిగా అమలు కాలేదని అఖిలేష్ అన్నారు.

**కనీస మద్దతు ధర**

అంతేకాదు రైతుల సహాయం కోసం కేంద్ర ప్రభుత్వం టమోటాలు, బంగాళాదుంపలు, ఇతర కూరగాయలకు కనీస మద్దతు ధర (%మీక్రా%) ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ పథకానికి వేల కోట్ల నిధులను కేటాయించామని బీజేపీ ప్రకటించింది. కానీ ఈ పథకం ఇంకా అమల్లోకి రాలేదని అఖిలేష్ గుర్తు చేశారు. అంతేకాదు గత కొన్ని సంవత్సరాలుగా రైతుల సంక్షేమానికి సంబంధించి తీసుకున్న చర్యలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోయాయని ఆరోపించారు.

**జనాభా పరంగా టాప్..**

ఈ క్రమంలో రైతుల సంక్షేమం గురించి మాట్లాడిన బీజేపీ, వారు ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు అఖిలేష్. జనాభా పరంగా దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం యూపీ. విస్తీర్ణం పరంగా నాల్గో స్థానంలో ఉంది. కానీ తలసరి ఆదాయం పరంగా మాత్రం యూపీ టాప్ 10లో లేదని విమర్శలు చేస్తున్నారు. జనాభా పరంగా దేశంలో చివరి స్థానంలో ఉన్న సిక్కిం, తలసరి వార్షిక ఆదాయం పరంగా మొదటి స్థానంలో ఉందని నివేదికలు చెబుతుండటం విశేషం.

## డిల్లీ స్పీకర్‌గా విజేందర్ గుప్తా ..

**న్యూఢిల్లీ :** పదేళ్ల క్రితం ఈ బీజేపీ నేతను.. అసెంబ్లీ నుంచి లాక్కెళ్లి.. ఎత్తుకెళ్లి.. మార్షల్ ఆయన్ను బయటపడేశారు. 2015, నవంబర్ 30న ఈ ఘటన చోటుచేసుకున్నది. ఆమ్ ఆద్మీ పార్టీ నేత అల్కా లంబాపై బీజేపీ నేత ఓపీ శర్మ ఓ కామెంట్ చేశారు. దాన్ని నిరసిస్తూ



అసెంబ్లీలో రగడ జరిగింది. ఆ సమయంలో విజేందర్ గుప్తా .. సభలో ఆప్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తెల్ల కుర్తా వేసుకుని ఆందోళన చేస్తున్న విజేందర్ గుప్తాను.. అసెంబ్లీ నుంచి మార్షల్ ఎత్తుకెళ్లారు. ఫర్నీచర్‌ను పట్టుకుని ఉన్నా.. ఆయన్ను అరడజను మంది గుంజుకెళ్లారు.తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆ రాష్ట్ర సీఎంగా ఇవాళ రేఖా గుప్తా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ ప్రభుత్వానికి ఇప్పుడు విజేందర్ గుప్తా స్పీకర్‌గా వ్యవహరించనున్నారు. రోహిణి నియోజకవర్గం నుంచి ఆయన గెలుపొందారు. 2015 నుంచి ఆయన అదే స్థానంలో ఉన్నారు. పార్టీ తనకు స్పీకర్ బాధ్యతను అప్పగించినందుకు థ్యాంక్స్ చెప్పారు. తన బాధ్యతలను నిర్వర్తించనున్నట్లు వెల్లడించారు. సభలో అర్థవంతమైన, ఆరోగ్యకరమైన చర్చలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఆమ్ ఆద్మీకి చెందిన 14 కాగ్ రిపోర్టులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ ప్రభుత్వం చేసిన అక్రమాలను వెలికి తీయనున్నట్లు ఇటీవల విజేందర్ గుప్తా పేర్కొన్నారు. తప్పుడు వాగ్దానాలతో ఢిల్లీ ప్రజల్ని ఆమ్ ఆద్మీ పార్టీ ఎలా మోసం చేసిందో బహిర్గతం చేయనున్నట్లు ఆయన చెప్పారు. వాస్తవానికి విజేందర్ గుప్తా.. సీఎం పోస్టుకు షార్ట్‌లిస్టులో ఉన్నట్లు ఆరంభంలో ఊహాగానాలు వినిపించాయి. కానీ సీఎం పోస్టు రేఖా గుప్తాను వరించింది.

# విమానంలో చిరంజీవి పెళ్లి రోజు వేడుక..



మెగాస్టార్ చిరంజీవి, సురేఖ దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని విమానంలో ఘనంగా జరుపుకున్నారు. ఫ్లైట్ లో దుబాయ్ వెళ్తూ పెళ్లి రోజును ఇలా సెలబ్రేట్ చేసుకున్నారు. అక్కినేని నాగార్జున, అమల, నమ్రత శిరోద్కర్ తదితరులు ఆ విమానంలో ఉన్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను చిరు తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేయగా వైరల్‌గా మారాయి. "దుబాయ్ మార్గమధ్యంలో కొంతమంది ప్రియమైన స్నేహితులతో విమానంలో మా వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకున్నాం. సురేఖ నా కలల జీవిత భాగస్వామి. ఆమె లాంటి సతీమణి దొరకడం నేను చాలా అదృష్టవంతుడిని అని భావిస్తున్నా. ఆమె నా బలం. ఆమె ఉనికి నిరంతరం ఓదార్పునిస్తుంది. అద్భుతమైన ప్రేరణనిస్తుంది. ఆమె నా మోటివేటర్. థ్యాంక్యూ సోల్‌మేట్. మీ అద్భుతమైన శుభాకాంక్షల కోసం స్నేహితులు, అభిమానులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులందరికీ ధన్యవాదాలు! ఆశీర్వదించండి!" అంటూ చిరు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పోస్ట్ పెట్టారు

# క్షమించండి..

## ఇకపై నా సినిమాల్లో అసభ్యత ఉండదు : విశ్వక్ సేన్



తన నటన, దర్శకత్వంతో మల్టీ టాలెంటెడ్ హీరోగా పేరు తెచ్చుకున్నాడు విశ్వక్ సేన్. సినిమా సినిమాకీ భిన్న కథలను ఎంచుకుంటూ, కొత్త కొత్త ప్రయోగాలు చేస్తూ కెరీర్ లో ముందుకెళ్తున్న మాస్ కా దాస్ విశ్వక్ సేన్ రీసెంట్ గా లైలా సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. రామ్ నారాయణ్ దర్శకత్వం వహించిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అయింది. షైన్ స్క్రీన్స్ బ్యానర్ లో సాహు గారపాటి నిర్మించిన ఈ సినిమాలో విశ్వక్ లేడీ గెటప్ లో కనిపించాడు. ఈ సినిమా ప్రమోషన్స్ లో లైలా సినిమాపై నమ్మకంతో విశ్వక్ ఎంతో కాన్ఫిడెంట్ గా సినిమా అందరినీ అలరిస్తుందని చెప్పాడు. ట్రైలర్ చూసి మూవీలో అడల్ట్ కంటెంట్ ఎక్కువగా ఉందేమో కదా అని ప్రమోషన్స్ లో అడిగితే అలాంటిదేమీ లేదని, థియేటర్లలో ప్రతి ఒక్కరూ లైలా మూవీ చూసి ఎంజాయ్ చేస్తారని చెప్పాడు. కానీ తీరా సినిమా థియేటర్లలోకి వచ్చాక లైలా సినిమా చూసిన ప్రతీ ఒక్కరూ ఆ సినిమా గురించి తిట్టే వాళ్లే. విశ్వక్ కెరీర్లోనే లైలా బిగ్గెస్ట్ డిజాస్టర్ మూవీ అని, అసలు ఇలాంటి అసభ్యకర సినిమాను ఎలా తీశావని సోషల్ మీడియాలో అందరూ విశ్వక్ పై మండిపడ్డారు కూడా. లైలా సినిమా అందరినీ నిరాశకు గురి చేసిన నేపథ్యంలో హీరో విశ్వక్ సేన్ అభిమానులకు ఓ బహిరంగ లేఖ రాశాడు. ఇటీవల "నా సినిమాలు అందరూ కోరుకున్న స్థాయికి చేరుకోలేకపోయాయి. నా చివరి సినిమాకు వచ్చిన నిర్మాణాత్మక విమర్శను పూర్తిగా అంగీకరిస్తున్నాను. నన్ను నమ్మి, నా ప్రయాణాన్ని మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ.. నా అభిమానులకు, నాపై ఆశీర్వాదంగా నిలిచినవారికి హృదయపూర్వక క్షమాపణలు. నా ప్రాధాన్యం ఎప్పుడూ కొత్తదనం తీసుకురావడమే, కానీ ఆ ప్రయత్నంలో మీ అభిప్రాయాలను నేను గౌరవిస్తున్నాను. ఇక పై, నా ప్రతి సినిమా క్లాస్ లేదా మాస్ అయినా సరే, అసభ్యత ఉండదు" అని విశ్వక్ రాసుకొచ్చాడు. దాంతో పాటూ "నేను ఒక చెడు సినిమా తీస్తే, నన్ను విమర్శించే హక్కు పూర్తిగా మీకు ఉంది. ఎందుకంటే, నా ప్రయాణంలో ఎవ్వరూ లేని సమయంలో నన్ను ప్రేమతో ముందుకు నడిపించింది మీరు. నా కెరీర్ ప్రారంభం నుంచి నేను ఎంచుకున్న కథలను మీరు ఎంతగా ప్రేమించారో తెలుసు. ఇక పై కేవలం సినిమా మాత్రమే కాదు, నా ప్రతి సన్నివేశం కూడా మీ మనసుకు తగిలేలా ఉండాలని నిర్ణయించుకున్నాను. అంతే కాకుండా, నా మీద విశ్వాసం ఉంచిన ప్రొడ్యూసర్స్, డిస్ట్రిబ్యూటర్స్ అందరికీ నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని విశ్వక్ తన మనసులోని భావాలను లెటర్ ద్వారా పంచుకున్నాడు. విశ్వక్ రాసిన ఆ లెటర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.



# విలాసం కాదు... సౌకర్యం ముఖ్యం: రకుల్

సినీ నటి రకుల్ ప్రీత్ సింగ్ బాలీవుడ్ నిర్మాత జాకీ భగ్నానీని పెళ్లాడి వైవాహిక బంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. కొద్దిమంది బంధుమిత్రుల సమక్షంలో వీరి పెళ్లి జరిగింది. పెళ్లికి వచ్చిన అతిథులు సెల్ ఫోన్లు వెంట తీసుకురావద్దనే కండిషన్ పెట్టారు. ఈ అంశంపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో రకుల్ స్పందించారు. పెళ్లి ఫొటోలు, వీడియోలు బయటకు వస్తాయనే భయంతో ఫోన్లను నిరాకరించామనే ప్రచారం జరిగిందని... అందులో వాస్తవం లేదని రకుల్ స్పష్టం చేశారు. వివాహ వేడుకను సింపుల్ గా జరపాలనుకున్నామని... అందుకే కొంతమంది సన్నిహితులను మాత్రమే పెళ్లికి ఆహ్వానించామని చెప్పారు. పెళ్లికి సంబంధించిన మధుర క్షణాలను అతిథులు కూడా ఆస్వాదించాలనే ఉద్దేశంతోనే 'నో ఫోన్' కండిషన్ పెట్టామని తెలిపారు. తన దృష్టిలో విలాసం కంటే సౌకర్యమే ముఖ్యమని అన్నారు. పెళ్లి తర్వాత ఫొటోలను తామే మీడియాకు విడుదల చేశామని తెలిపారు. సినిమాల విషయానికి వస్తే... రకుల్ తాజా చిత్రం 'మేరే హస్బెండ్ కీ బీవీ' ఈ నెల 21వ విడుదల

# ఛావాను రిజెక్టు చేసిన మహేష్‌బాబు



బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో వచ్చిన తాజా చిత్రం ఛావా. రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటించగా.. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించాడు. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్ టాక్‌తో దూసుకెళుతుంది. ఇప్పటికే రూ.150 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం రూ.200 కోట్ల దిశగా దూసుకెళుతుంది. అయితే ఈ సినిమా కథ మొదట సూపర్ స్టార్ మహేశ్ బాబు దగ్గరికి వచ్చినట్లు తెలుస్తుంది. ఈ మూవీ దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ శంభాజీ పాత్ర కోసం మొదట మహేశ్ బాబు సంప్రదించినట్లు తెలుస్తుంది. అయితే ఈ ప్రాజెక్ట్ నచ్చని మహేశ్ రిజెక్ట్ చేశాడు. దీంతో చాలా రోజుల తర్వాత మళ్లీ ఇదే కథతో విక్కీ కౌశల్ దగ్గరికి వెళ్లగా విక్కీ ఒకే చెప్పినట్లు తెలుస్తుంది. అయితే మహేశ్‌కి ఇలా సూపర్ హిట్ అయిన సినిమాలు రిజెక్ట్ చేయడం కొత్తేమి కాదు. ఇంతకుముందు కూడా మురుగదాస్ దర్శకత్వంలో వచ్చిన గజిని సినిమాను, అల్లు అర్జున్ నటించిన పుష్ప సినిమాను రానా నటించిన లీడర్, రణబీర్ కపూర్ హీరోగా వచ్చిన యానిమల్, ప్రభాస్ వర్షం, రవితేజ ఇడియట్, విజయ్ దళపతి నన్బన్, నాగ చైతన్య ఏ మాయ చేసావే, పూరీ జనగణమన (ప్రాజెక్ట్ స్టార్ట్ కాలేదు) తదితర సినిమాలను మహేశ్ రిజెక్ట్ చేశాడు.

# ఆసక్తి రేపుతున్న ఓదెల-2



టాలీవుడ్ మిల్కీ బ్యూటీ తమన్నా ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం ఓదెల 2. సంపత్ నంది ప్రొడక్షన్ హౌజ్ నుంచి వస్తోన్న ఈ చిత్రానికి అశోక్ తేజ దర్శకత్వం వహిస్తున్నాడు. ఓం నమ: శివాయ.. అంటూ తమన్నా శివశక్తి లుక్ ఇప్పటికే నెట్టింట పోస్టర్లు వైరల్ అవుతున్నాయని తెలిసిందే. ఈ చిత్రంలో తమన్నా మహదేవ్‌కు పరమభక్తురాలిగా, ఓదెల సద్గుణ రక్షకురాలిగా కనిపించనుంది. చాలా రోజుల తర్వాత ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్‌ను షేర్ చేశారు మేకర్స్. ఈ సినిమా ఖాతాలో అరుదైన ఫీట్ చేరనుంది. ఓదెల 2 టీజర్‌ను ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభ్ మేళాలో ఫిబ్రవరి 22న లాంచ్ చేయనున్నారు. ప్రఖ్యాత పుణ్యక్షేత్రంలో టీజర్ లాంచ్ చేసుకోబోతున్న తొలి ఇండియన్ సినిమాగా చరిత్రలో నిలిచిపోనుంది. ఈ లాంచ్ ఈవెంట్‌కు చిత్రయూనిట్, మేకర్స్ హాజరుకానున్నారు. మొత్తానికి దేశమంతా మహాకుంభ్ మేళావైపు చూస్తున్న నేపథ్యంలో అక్కడే టీజర్ లాంచ్ సినిమాపై అందరి అటెన్షన్‌ను తమవైపునకు తిప్పుకుంటోంది. ఈ చిత్రంలో వశిష్ఠ ఎన్ సింహా, హరిప్రియ ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని సంపత్ నంది టీమ్ వర్క్స్ బ్యానర్, మధు క్రియేషన్స్‌పై తెరకెక్కిస్తున్నారు. కాంతార ఫేం అజనీష్ లోక్‌నాథ్ ఈ మూవీకి మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తుండటంతో అంచనాలు భారీగా నెలకొన్నాయి. ఓదెల 2 కోసం తమన్నా శివశక్తి రూపంలోకి ఎలా మారిందని తెలియజేస్తూ మేకింగ్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్.

# దాదాపు పూర్తయిన వార్-2 షూటింగ్

## ఆగస్టు 25న ప్రేక్షకుల ముందుకు..



బాలీవుడ్ కథానాయకుడు హృతిక్ రోషన్ , టాలీవుడ్ స్టార్ హీరో ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'వార్ 2'. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రానున్న ఈ స్పై థ్రిల్లర్ ఇది. ఈ చిత్రానికి రైటర్ గా పని చేస్తున్న అబ్బాస్ ఓ అప్‌డేట్ ఇచ్చారు. "వార్ 2' షూటింగ్ దాదాపు పూర్తయింది. ఆగస్టు 25న విడుదలయ్యే అవకాశం ఉంది. ఆరోజు హృతిక్ రోషన్, ఎన్టీఆర్‌లను థియేటర్‌లో కలుద్దాం. 'వార్ 2'లో డైలాగులన్నీ నేనే రాశాను. అందరికి నచ్చేలా ఉంటాయి. షారుక్‌ఖాన్, సిద్ధార్థ్ ఆనంద్‌ల కాంబోలో ఓ సినిమా ప్రారంభం కానుంది. 'పఠాన్ 2' కూడా సిద్ధమవుతోంది. ఈ రెండు సినిమాలకు రచయితగా వర్క్ చేస్తున్నాను. " అని తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అబ్బాస్ తెలిపారు. హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా తెరకెక్కిన చిత్రం 'వార్'. ఈ స్పై థ్రిల్లర్ సూపర్‌హిట్ కావడంతోపాటు భారీ వసూళ్లు రాబట్టింది. సినిమాపై అంచనాలు ఉండటంతో దీనికి సీక్వెల్‌గా 'వార్2' తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో ఎన్టీఆర్ రా ఏజెంట్‌గా నటించనున్నట్లు తెలుస్తోంది. గతంలో సల్మాన్ ఖాన్, హృతిక్ రోషన్, షారుక్‌ఖాన్‌లు ఏజెంట్ పాత్రల్లో నటించి మంచి విజయాన్ని అందుకున్నారు. వీటన్నింటికంటే భిన్నంగా ఎన్టీఆర్ పాత్ర ఉంటుందని వార్తలు వస్తున్నాయి. ఇటీవల ఎన్టీఆర్ ఓ షెడ్యూల్ చేసి వచ్చారు. ఈ సినిమా పూర్తయిన తర్వాత తారక్ ప్రశాంత్ నీల్ చిత్రం షూటింగ్‌లో పాల్గొనున్నారు.

# గోలీమార్ సీక్వెల్ రెడీ అవుతున్న పూరీ



అగ్ర దర్శకుడు పూరీ జగన్నాథ్ ప్రస్తుతం ఒక సాలిడ్ కంబ్యాక్ కోసం ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఆయన గత చిత్రాలైన లైగర్, డబుల్ ఇస్మార్ట్ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అవ్వడంతో ఎలాగైన మళ్లీ హిట్టు కొట్టాలనే కసితో పని చేస్తున్నాడు. ఈ క్రమంలోనే ఆయన లేటెస్ట్ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ బయటికి వచ్చింది. పూరీ జగన్నాథ్ గోపిచంద్ కాంబోలో వచ్చిన సూపర్ హిట్ చిత్రం గోలిమార్. ప్రియమణి కథానాయికగా నటించగా.. బెల్లంకొండ సురేష్ బాబు ఈ సినిమాను నిర్మించాడు. 2010లో విడుదలైన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకోవడమే కాకుండా గోపిచంద్ కెరీర్‌లో మరిచిపోలేని చిత్రంగా మిగిలింది. పోలీస్ మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రంలో గంగారాం అనే పోలీస్ పాత్రలో ఆకట్టుకున్నాడు గోపిచంద్. అయితే ఈ సినిమా వచ్చి 15 ఏండ్ల అవుతున్న తర్వాత ఈ సినిమాకు పూరీ జగన్నాథ్ సీక్వెల్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన స్క్రిప్ట్ పనులు కూడా పూర్తయినట్లు తెలుస్తుంది. గోపిచంద్ కూడా ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలుస్తుంది. మరోవైపు ఈ సీక్వెల్‌ను కూడా బెల్లంకొండ సురేష్ నిర్మించబోతున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.